ప్రజాశక్తి
ఆదివారం 8 అక్టోబర్ 2023
8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి

విశాఖకు ఇ - బస్సులు

◆ 200 కేటాయింపు, మార్చిలోగా 100 వచ్చే అవకాశం
◆ సింహాచలంలో ప్రత్యేక డిపో నిర్మాణానికి ఆర్‌టిసి కసరత్తు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ప్రజా రవాణా వ్యవస్థలో మార్పులు దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా వాయు, శబ్ద కాలుష్యంతో బావితరాలు అవస్థలు పడకుండా ఉండే దిశగా ఎకో - వెహికల్ పాలసీని తీసుకుంటోంది. ఇ-బస్సులను రాష్ట్రంలోని కొన్ని ముఖ్య పట్టణాలు, నగరాల్లో రోడ్లపై తిప్పేందుకు రంగం సిద్ధమవుతోంది. దీంట్లో భాగంగా 2025 మార్చిలోగా విశాఖ, తిరుపతి, నెల్లూరు, విజయవాడ వంటి చోట్ల కొన్ని విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయని ఆర్‌టిసి ఉన్నతాధికారులు వెల్లడిస్తున్నారు. విశాఖపట్నం ప్రజారవాణా శాఖ అధికారి ఎ.అప్పలరాజు 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ విశాఖ జిల్లాకు 200 బస్సుల కేటాయింపు ఉందని, 2024 డిసెంబర్‌లోగా అది సాకారం అవుతుందని అన్నారు. ఈ నేపథ్యంలో 2024 మార్చిలోగా విశాఖకు 100 బస్సులైనా వచ్చే అవకాశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. తిరుమల ఘాట్‌రోడ్డులో ఇప్పటికే విద్యుత్ బస్సులను ప్రభుత్వం ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఆ తరువాత విశాఖపైనే దృష్టిపెట్టినట్టు సమాచారం. విద్యుత్ బస్సులకు విశాఖలోని సింహాచలం సమీపాన ప్రత్యేక డిపో నిర్మాణానికి కూడా రాష్ట్ర ప్రజా రవాణా సంస్థ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు స్పష్టమవుతోంది. ఈ స్థలాన్ని ఇదివరకే ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు కూడా పరిశీలించారు.

ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పెద్ద సమస్యే ?

విశాఖలో విద్యుత్ స్కూటర్లు, కార్లు గణనీయంగానే తిరుగుతున్నాయి. వీటికి ఛార్జింగ్ స్టేషన్ల సమస్య వెంటాడుతోంది. ప్రజా రవాణా వ్యవస్థలో ఇలాంటి మార్పు తీసుకొచ్చే ముందు మౌలిక వసతుల పరిస్థితి అత్యంత కీలకంగా మారనుంది. ఇ-బస్సులకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నప్పటికీ అందుకు సంబంధించిన 'ఎలక్ట్రికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్'ను కూడా సమకూర్చుకోవాల్సి ఉంది. దీనికి రూ.లక్షలు ఖర్చుకానుంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రజారవాణా సంస్థలో 10 నుంచి 15 ఏళ్ల సర్వీసు దాటిన పలు బస్సులున్నాయి. వీటి వల్ల కాలుష్యం మరింత వేగంగా విస్తరిస్తోంది. కాలుష్య రహిత విద్యుత్ బస్సుల ప్రవేశం అనేది అవశ్యంగా మారింది. విద్యుత్ బస్సుల కొనుగోలుకు సైతం రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని మిగతా 2లో..

స్మార్ట్ మీటర్ల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం

ప్రజాశక్తి - అనకాపల్లి : విద్యుత్ సర్వీసులకు స్మార్ట్ మీటర్లు పెట్టాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాథం శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్మార్ట్ మీటర్ల వ్యయాన్ని భవిష్యత్తులో విద్యుత్ ఛార్జీలు పెంచి వినియోగదారుల నుంచి వసూలు చేయనున్నట్టు తెలిపారు. ప్రభుత్వ చర్యలు వల్ల వినియోగదారులపై భారాలు పెరుగుతాయన్నారు. ప్రీ పెయిడ్, పోస్టు పెయిడ్ మీటర్ల ఏర్పాటుతో ఉద్యోగుల సంఖ్య కూడా తగ్గించే అవకాశం ఉందని తెలిపారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించి రానున్న కాలంలో సబ్సిడీ ఎత్తివేయాలన్న ఆలోచనతో ప్రభుత్వం ఉందన్నారు. రాష్ట్రంలో రెండు కోట్ల విద్యుత్ వినియోగదారులకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు పెట్టడానికి టెండర్లు పిలిచారని తెలిపారు. అదానీ తదితర కార్పొరేట్లకు ఈ కాంట్రాక్టును కట్టబెట్టారని పేర్కొన్నారు. మీటర్లు రైతులు, వినియోగదారుల పాలిట ఉరితాళ్లుగా మారనున్నాయన్నారు. ముందుగానే విద్యుత్ బిల్లులు చెల్లించే ప్రీపెయిడ్ విధానం ప్రవేశపెడుతున్నారని తెలిపారు. స్మార్ట్ మీటర్లకయ్యే వేలాది రూపాయలను వినియోగదారులే భరించాల్సి ఉందని తెలిపారు.

16న విశాఖకు సిఎం జగన్

ఏర్పాట్లను పరిశీలించిన జివిఎంసి కమిషనర్

ప్రజాశక్తి-విశాఖపట్నం : విశాఖ నగరంలో ఇన్ఫోసిస్ ఐటీ కంపెనీ ప్రారంభోత్సవానికి ఈ నెల 16న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రానున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లను పూర్తి చేయాలని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. శనివారం రుషికొండ ఐటి సెజ్ ప్రాంతాలలో పర్యటించి, పారిశుధ్యం, విద్యుత్తు, రహదారి పనులు పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఇన్ఫోసిస్ అధికారులతో మాట్లాడి ప్రారంభోత్సవ ఏర్పాట్లను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. పర్యటనలో అదనపు కమిషనర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన ఇంజినీర్ రవికృష్ణ రాజు, పట్టణ ప్రణాళిక అధికారి సునీత, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి, ఎస్ఇ శాంసన్‌రాజు పాల్గొన్నారు.

పలు రైళ్లు రద్దు, దారి మళ్లింపు
▶ వార్త 2లో..

ల్యాండ్ పూలింగ్‌లో భూములిచ్చేది లేదు
▶ వార్త 5లో..

సాగర తీరాన వైజాగ్ ఆటో ఎక్స్‌పో
▶ వార్త 2లో..

జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న ఆశా కార్యకర్తలు

ప్రభుత్వంపై ఆశాల ఆగ్రహం

నిరంకుశత్వాన్ని ఖండిస్తూ విశాఖ, అనకాపల్లిల్లో ధర్నాలు వార్త 8లో..

జాతీయ స్థాయి చెస్ టోర్నీ విజేతలు ఆన్ష్, ప్రతీతి

ప్రజాశక్తి - సీతమ్మధార : విశాఖ పోర్టు స్టేడియంలో జరుగుతున్న జాతీయ స్థాయి అండర్-11 చెస్ పోటీలు శనివారంతో ముగిశాయి. బాలుర విభాగంలో 10 పాయింట్లతో ఆన్ష్ నందన్ (మహారాష్ట్ర), బాలికల విభాగంలో 9.5 ప్లాయింట్లతో ప్రతీతి జయకేతనం ఎగురవేశారు. ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన టిడిడి మాజీ ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి, నెడ్ క్యాప్ ఛైర్మన్ కెకె.రాజు, తెలంగాణ చెస్ అసోసియేషన్ అధ్యక్షులు కెఎస్.ప్రసాద్ విజేతలకు బహుమతులు అందజేశారు. ఇక టోర్నీ విషయానికొస్తే.. 10 పాయింట్లుతో ఆన్ష నందన్ (మహారాష్ట్ర), 9 పాయింట్లుతో సిద్ధాంత పూంజా (కర్ణాటక), ఆదిక్ థియోఫేన్ (కేరళ), సయ్యద్ అబ్దుల్ ఖాదర్ (కర్ణాటక), మయాఖ్ మజుందాకర్ (వెస్ట్ బెంగాల్) మొదటి ఐదు స్థానాలు కైవసం చేసుకున్నారు. బాలికల విభాగంలో 9.5 పాయింట్లుతో ప్రతీతి (కర్ణాటక), 9 పాయింట్లతో సిద్దిరావు (కర్ణాటక), 8.5 పాయింట్లుతో పవిత్ర (తమిళనాడు), శరణ్యదేవి (తెలంగాణి), మైషా పర్వేజ్ (మహారాష్ట్ర) మొదటి ఐదు స్థానాలు కైవసం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన క్రీడాకారులు బాలురు విభాగంలో 8 పాయింట్లుతో శ్రీ అఖిలప్రసాద్, బాలికల విభాగంలో త్రిపురాంబిక ఆరో స్థానంలో నిలిచారు. ఈ పోటీల్లో మొదటి, రెండు స్థానాలు సాధించిన వారు 2024లో జరగబోయే ఏషియన్, కామన్వెల్త్, వరల్డ్ చెస్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు, ఆంధ్ర చెస్ అసోసియేషన్ సభ్యులు కెవివి.శర్మ, భీమారావు, మణికంత తెలిపారు.

చెస్ టోర్నీ విజేతలతో వైవి.సుబ్బారెడ్డి, తదితరులు

మొదటి పేజీ తరువాయి..

విశాఖకు ఇ - బస్సులు

ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఏళ్లుగడచిన బస్సులను డిపోల్లోనే తుక్కుగా మార్చే ప్రక్రియకు ప్రభుత్వం ఓకే చెప్పినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే విద్యుత్ బస్సుల డిమాండ్, ఉత్పత్తి అంచనాలపై నివేదికలు సిద్ధమవుతున్నాయి. 15 ఏళ్ల సర్వీసు దాటిన బస్సుల వివరాలను రాష్ట్రంలోని డిపోల వారీగా అధికారులు సేకరిస్తున్నారు. విద్యుత్ బస్సులను అధిక వ్యయం వెచ్చించి కొనుగోలు చేయడం, నడపడంతో ప్రయాణికులపై ఆ మేరకు ఛార్జీల భారం పడనుంది.

ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు, భవన నిర్మాణ కార్మికులు

గాయపడ్డ కార్మికున్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : అబిద్ నగర్‌లో నిర్మాణంలో ఉన్న అపార్టుమెంట్‌లో పనిచేస్తున్న కార్మికుడు ఎర్రమనాయుడు తీవ్రంగా గాయపడ్డాడని, అతనిని బిల్డర్ ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో నిర్మాణంలో ఉన్న అపార్టుమెంట్ వద్ద ఆందోళన చేపట్టారు. సంఘం అధ్యక్షుడు కె.నరసింగరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం.సుబ్బారావు మాట్లాడుతూ 10 రోజుల క్రితం ఎర్రమనాయుడు పనిచేస్తుండగా పరంజి విరిగిపోయి గాయపడ్డాడన్నారు. ఈ విషయమై బిల్డర్ రవికుమార్‌తో మాట్లాడగా తనకు ఎటువంటి సంబంధమూ లేదని చెప్పడం తగదన్నారు. పని ప్రదేశాల్లో ప్రమాదం జరిగితే బిల్డర్‌దే బాధ్యత అనే విషయాన్ని అతను విస్మరించడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో మేస్త్రీలు సూరిబాబు, నాయుడు, సూర్య అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఆటో ఎక్స్‌పో ప్రారంభ కార్యక్రమంలో ఎయు విసి ప్రసాద్‌రెడ్డి, తదితరులు

సాగర తీరాన వైజాగ్ ఆటో ఎక్స్‌పో

ప్రజాశక్తి- కలెక్టరేట్: విశాఖ నగరం ఆటోమొబైల్ హబ్‌గా మారిందని ఎయు విసి ఆచార్య పివిజిడి ప్రసాద్ రెడ్డి అన్నారు శనివారం బీచ్‌రోడ్‌లోని విశ్వప్రియ ఫంక్షన్ హాల్‌లో రెండు రోజుల ఆటో ఎక్స్‌పోను రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ ఆర్‌సిహెచ్ శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు..ఈ సందర్భంగా ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రేస్ ఎంటర్‌టైన్మెంట్స్ ఈవెంట్ మేనేజర్ దాడి రవికుమార్ పదేళ్లుగా విశాఖపట్నంలో ప్రముఖ బ్రాండ్ల కంపెనీల కార్లు, బైక్‌లు ఒకే చోటకు చేర్చి, వాహన కొనుగోలుదారులకు ప్రత్యేక డిస్కౌంట్ ఆఫర్లు వచ్చేలా ఈవెంట్ చేయడం అభినందనీయమన్నారు. ఆర్‌టిఒ శ్రీనివాస్ మాట్లాడుతూ విశాఖపట్నంలో అన్ని ఆటోమొబైల్ కంపెనీలు ఎంతో ఆరోగ్యకరమైన వాతావరణంలో వ్యాపారాలు కొనసాగిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఎపి టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నెగంటి విజయ మోహన్, విజన్ పత్రిక ఎడిటర్ ఎస్ఎస్ శివశంకర్, జాతీయ జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు పాల్గొన్నారు.

మణికుమార్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: ఎయు డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషల్ వర్క్ విభాగంలో మణికుమార్ బాబు మానుకొండకు డాక్టరేట్ లభించింది. ఆచార్య పి.అర్జున్ పర్యవేక్షణలో 'ఎసెస్మెంట్ ఆఫ్ సోషియో ఎకనామిక్ అండ్ హెల్త్ స్టేటస్ ఆఫ్ పివిటిజిస్ అండ్ థైర్ స్పాటైల్ డిస్ట్రిబ్యూషన్ ఇన్ పాడేరు డివిజన్ విశాఖపట్నం, డిస్టిక్ నార్త్ కోస్టల్ ఆంధ్రప్రదేశ్ ఈస్ట్‌కోస్ట్ ఆఫ్ ఇండియా' అనే అంశంపై పరిశోధన పూర్తి చేసిన, సమర్పించిన థీసెస్‌కు ు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా ఎయు విసి ప్రసాద్‌రెడ్డి తన చాంబర్లో మణికుమార్ మానుకొండకు పిహెచ్‌డి పత్రాలను అందజేసి, అభినందించారు. మణికుమార్‌ను హెచ్‌ఒడి ఆచార్య పి హరినాథ్, ప్రొఫెసర్ పి అర్జున్ అభినందించారు.

'ఉక్కు'పై కేంద్రం దిగిరావాల్సిందే...!

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం ఈ నెల 5న కూర్మన్నపాలెం సమీపంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద సిపిఎం ఆధ్వర్యాన జరిగిన భారీ కార్మిక, ప్రజా బహిరంగ సభ విజయవంతం కావడం కేంద్రంలోని కాషాయ పాలకులకు గట్టి సవాల్ ఎదురైనట్టేనన్న చర్చ విశాఖలో సాగుతోంది. కేంద్రం తాను అనుకున్న ప్రైవేటీకరణ, అమ్మకం ఆపి దిగిరాక తప్పదన్న రీతిలో ఈ సభ విజయవంతమైంది. కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలపై ఢిల్లీ కేంద్రంగా దేశ రైతాంగం నిర్వహించిన పోరాట స్ఫూర్తితో విశాఖ కార్మికవర్గం మరింత గట్టిగా పోరాడి స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాలన్న నినాదం హస్తిన పాలకులకు బాగానే చేరింది. ఇన్నాళ్లూ ప్లాంట్‌ను కేంద్రం అమ్మేందుకు ఎన్ని కుట్రలకు పాల్పడినా కార్మికులు, ఈ ప్రాంత ప్రజానీకం జరిపిన పోరాటం అడ్డుకోగలిగిందన్నది వాస్తవం. పూర్తిగా ప్రైవేటీకరణను ఆపే దిశగా పోరాటాన్ని కొనసాగించాలన్న స్ఫూర్తి ఈ నెల 5న స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద సిపిఎం ఆధ్వర్యాన జరిగిన భారీ బహిరంగ సభలో పాల్గొన్న వేల సంఖ్యలో ప్రజలు, కార్మికులు పొందారనడంలో ఎలాంటి సందేహమూ లేదు. ఈ సభ ద్వారా మోడీ ప్రభుత్వానికి, రాష్ట్రంలోని వైసిపి, తెలుగుదేశం, జనసేనలకు ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, ప్లాంట్ కార్మికులు, సిపిఎం నాయకులు గట్టి హెచ్చరికలు పంపారు. 968 రోజులుగా స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కార్మికులు

కొనసాగిస్తున్న ఉద్యమాన్ని ఈ సభలో ప్రధాన వక్తగా పాల్గొన్న సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి అభినందించారు.

ఎన్నికల సమయం...మరింత పోరాటాలే మార్గం

ఇది ఎన్నికల సమయం అని..ఈ తరుణంలో వీరోచితంగా పోరాడడం ద్వారా స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకోవాలని ఏచూరి ఆ సభలో దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు మూడూ మోడీ భజన మాని తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం కార్మికులు, ప్రజానీకంతో కలసి రావాలంటూ పిలుపునివ్వడం విశేషం. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలు ప్రజానీకం ఆస్తి అని, వీటిని ప్రజలే రక్షించుకోవాలని.. అలాంటి పోరాటం వైజాగ్‌లో జరుగుతోందని, దేశంలోని మిగతా ప్రభుత్వ రంగ సంస్థలకు ఇదే మార్గదర్శకం కాగలదని పాల్గొన్న వక్తలంతా వెల్లడించారు. స్టీల్‌ప్లాంట్‌ను నాశనం చేయాలన్న పాలకుల కుట్రలు ఈనాటివి కావని, 2000 దశకం నుంచీ ఈ ప్రాంతంపై కేంద్ర పాలకులు కక్షసాధింపు చేస్తూనే ఉన్నారని, కార్మికకర్గం వాటిని తిప్పికొడుతూనే ఉందని నేతలు గుర్తుచేశారు. మరీ ముఖ్యంగా బిజెపితో స్టీల్‌ప్లాంట్‌కు అనుక్షణం ద్రోహమే జరుగుతోందని, వచ్చే ఎన్నికల్లో దేశ ప్రజానీకం ఆ పార్టీని దూరం పెట్టేలాగ పోరాటం చేయాలని కార్మికులకు సీతారాం ఏచూరి పిలుపునివ్వడంతో సభికులంతా హర్షాధ్వానాలు చేశారు.

పలు రైళ్లు రద్దు, దారి మళ్లింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ డివిజన్‌లో భద్రతా పనుల కారణంగా పలు రైళ్లు రద్దయ్యాయి. మరికొన్ని దారి మళ్లించబడ్డాయి. ఈ నేపథ్యంలో 07466 రాజమండ్రి-విశాఖపట్నం ప్యాసింజర్ స్పెషల్, 07467 విశాఖపట్నం-రాజమండ్రి ప్యాసింజర్ ప్రత్యేక రైలు, 17239 గుంటూరు-విశాఖపట్నం సింహాద్రి ఎక్స్‌ప్రెస్, 17219 మచిలీపట్నం-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్‌లను అక్టోబర్ 9 నుంచి 15 వరకు రద్దు చేశారు. 17240 విశాఖపట్నం-గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్, 17220 విశాఖపట్నం-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్‌లను అక్టోబర్ 10 నుంచి 16 వరకు, 22701 విశాఖపట్నం - విజయవాడ ఉదయ్ ఎక్స్‌ప్రెస్, 22702 విజయవాడ-విశాఖపట్నం ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌లను అక్టోబర్ 9, 10, 11, 13, 14 తేదీల్లో రద్దు చేశారు.

రైళ్ల దారి మళ్లింపు ఇలా..

13351 ధన్‌బాద్ - అలెప్పి బొకారో ఎక్స్‌ప్రెస్ అక్టోబర్ 09 నుండి 13 వరకు, 12889 టాటా నగర్-ఎస్ఎంవి బెంగళూరు ఎక్స్‌ప్రెస్ అక్టోబర్ 13న, 18111 టాటా-యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ అక్టోబర్ 12న, 12835 హతియా-ఎస్ఎంవి బెంగళూరు ఎక్స్‌ప్రెస్ అక్టోబర్ 10న, 12376 జసిదిహ్-తాంబరం ఎక్స్‌ప్రెస్ అక్టోబర్ 11న, 22837 హతియా-ఎర్నాకులం ఎసి ఎక్స్‌ప్రెస్ అక్టోబర్ 9న సాధారణ మార్గమైన నిడదవోలు-ఏలూరు-విజయవాడ మీదుగా కాకుండా నిడదవోలు-భీమవరంటౌన్-గుడివాడ-విజయవాడ మీదుగా మళ్లించిన మార్గంలో నడుస్తాయని రైల్వే అధికారులు తెలిపారు. ప్రజలు ఈ మార్పులను గమనించి తదనుగుణంగా వ్యవహరించాలని రైల్వే శాఖ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎకె.త్రిపాఠి అభ్యర్థించారు.

ఎయులో అడివి బాపిరాజు జయంతి వేడుకలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్ర విశ్వకళా పరిషత్ తెలుగు విభాగం ఆధ్వర్యంలో అడివి బాపిరాజు జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సమైక్యభారతి జాతీయ సమన్వయకర్త పి.కన్నయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడివి బాపిరాజు బహుముఖ ప్రజ్ఞాశాలి అని, ఆయన సాహిత్యం, వ్యక్తిత్వం చాలా గొప్పవని

మాట్లాడుతున్న పి.కన్నయ్య

కొనియాడారు. సీనియర్ ఆచార్యులు వెలమల సిమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

15న బహిరంగ సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-రంపచోడవరం (అల్లూరి జిల్లా)

రంపచోడవరం మండల కేంద్రంలో ఈనెల 15వ తేదీన సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ పిలుపునిచ్చారు. శనివారం రంపచోడవరం మండలం మర్రివాడ గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రంపచోడవరం కేంద్రంగా ప్రత్యేక జిల్లాను ఏర్పాటు చేయాలని, పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలని, రంపచోడవరం నియోజకవర్గంలో ఉన్న పలు సమస్యలపైనా పోరాడేందుకు ఈ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోతా రామారావు, మట్ల వాణిశ్రీ, గిరిజన సంఘం నాయకులు తీగల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

శారదా సుబ్రమణియంకు పురస్కారం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : నగరానికి చెందిన ప్రముఖ కర్ణాటక, శాస్త్రీయ సంగీత విద్వాంసురాలు డాక్టర్ గుమ్ములూరి శారదా సుబ్రమణియంకు ఛత్తీస్‌గడ్ రాష్ట్ర రాజధాని రాయపూర్‌లో ఐటిఎం యూనివర్సిటీ స్నాతకోత్సవం సందర్భంగా డాక్టర్ ఆఫ్ లెటర్స్ (డి-లిట్) పురస్కారాన్ని ఆ రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరి చందన్ అందజేశారని కళాభారతి ట్రస్టీ రాంబాబు తెలిపారు. విశాఖలోని విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉచిత సంగీత పాఠశాలను అద్వితీయంగా నడుపుతూ గాయకులను తీర్చిదిద్దినందుకుగానూ ఈ పురస్కారం శారదా సుబ్రమణియంకు దక్కిందన్నారు.

'డెమోక్రసీ ఇన్ డేంజర్' పేరిట సమావేశాలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్రంలో నాలుగున్నర సంవత్సరాలుగా సాగుతున్న వైసిపి అరాచక పాలనను వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా డెమోక్రసీ ఇన్ డేంజర్ పేరుతో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తున్నట్టు టిడిపి యువ నాయకులు ఆడారి కిషోర్ కుమార్ తెలిపారు. శనివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొట్టమొదటి సమావేశం విశాఖపట్నం రామా టాకీస్ రోడ్డులో ఉన్న అంబేద్కర్ భవనంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. సమావేశంలో కాళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'డ్యూరో లెజెండ్'లో సత్కారం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : భారతదేశ ప్రీమియం, అనుభవం కలిగిన ప్లైవుడ్ తయారీ సంస్థలలో ఒకటైన డ్యూరోప్లై ఇటీవల నిర్వహించిన 'డ్యూరో లెజెండ్' కార్యక్రమంలో దక్షిణ భారతదేశానికి చెందిన నైపుణ్యం కలిగిన భాగస్వాములను సత్కరించటం జరిగిందని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అఖిలేష్ చిట్లంగియా తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ ప్లైవుడ్, బ్లాక్‌బోర్డ్‌లు, డోర్‌ల ప్రీమియం శ్రేణికి డ్యూరోప్లై ఎంతో మన్నన పొందిందన్నారు. ఇది ఇప్పటికే ఉత్తర భారతదేశంలో ప్రముఖ సంస్థగా ఉందని, దక్షిణ, తూర్పు, పశ్చిమ భారతదేశంలో కంపెనీ వేగంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు.

కొనసాగుతున్న టిడిపి నిరసన దీక్షలు

విశాఖ నగరంలో టిడిపి ఆధ్వర్యాన భారీ నిరసన ర్యాలీ

చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ఆందోళనలు మిన్నంటుతున్నాయి. 'బాబుతో నేను సైతం'తో ఒకవైపు సంఘీభావ ప్రచారం చేపడుతూనే, మరోవైపు 'సేవ్ ఏపీ, సేవ్ డెమోక్రసీ' నినాదంతో పార్టీ పిలుపుమేరకు 'కాంతితో క్రాంతి' ఆందోళన చేపట్టారు. గుడ్డి వైసిపి ప్రభుత్వం కళ్లు తెరిపించాలంటూ నినాదాలు చేస్తూకాగడాలు, కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు.
- (ప్రజాశక్తి విలేకర్ల యంత్రాంగం)

విశాఖ కలెక్టరేట్ : చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ టిడిపి కార్యాలయం నుంచి ఎల్ఐసి దరి అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి అనుమతి లేదంటూ పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ టిడిపి నాయకులు, కార్యకర్తలు వెరవక ముందుకు సాగారు. రోడ్డుపై బైఠాయించారు. అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకొని చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం నియంతపాలన సాగిస్తోందన్నారు. పార్టీ విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, అనకాపల్లి పార్లమెంట్ అధ్యక్షుడు బుద్ధ నాగ జగదీశ్వరరావు, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, వేపాడ చిరంజీవిరావు, పార్టీ పొలిట్ బ్యూరో సభ్యురాలు వంగలపూడి అనిత, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, పివిజి.కుమార్ పాల్గొన్నారు.

మాధవధార : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా బాబుతోనేను కార్యక్రమంలో భాగంగా 51వ వార్డు తెలుగుదేశం నేత సనపల కీర్తి ఆధ్వర్యంలో శనివారం ఇంటింటా కరపత్రాలను పంపిణీ చేశారు. చంద్రబాబును విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే గంటా ఆదేశాలతో నిర్వహించిన నిరసనలో జయ రాజు, గురుగుబెల్లి షన్ముఖరావు, బొద్దేపల్లి లలిత, పేడాడ మధుసూధనరావు, మూల అప్పారావు పాల్గొన్నారు.

భీమునిపట్నం : చంద్ర బాబు అరెస్టును నిరసిస్తూ స్థానిక పార్టీ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన దీక్షలు శనివారం నాటికి 28వ రోజుకు చేరాయి. పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు ఆధ్వర్యంలో 1,2,3,4 వార్డుల అధ్యక్షులు టి సూరిబాబు, బడిగింటి నీలకంఠం, పాసి నరసింగరావు, తెలుగు యువత ఉపాధ్యక్షులు పాసి త్రినాథకుమార్,పాల్గొన్నారు

సింహగిరిపై పోలీసులతో వాగ్వాదం

పోలీసులతో మాజీ ఎమ్మెల్యే పీలా వాగ్వాదం, పక్కనే బండారు

సింహాచలం: చంద్రబాబు విడుదల కోరుతూ సింహాద్రి అప్పన్న దర్శనానికి వచ్చిన టిడిపి నేతలు, పోలీసుల మధ్య సింహగిరిపై వాగ్వాదం జరిగింది. శనివారం మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఆధ్వర్యంలో టిడిపి నేతలు సింహాద్రి అప్పన్నను దర్శించుకున్న తర్వాత మీడియాతో మాట్లాడే సమయంలో పోలీసులు అభ్యంతరం చెప్పారు. సింహగిరిపై రాజకీయాలకు అవకాశం లేదని పోలీసులు అడ్డుచెప్పడంతో, తాము ఎందుకు వచ్చామో మీడియాతో మాట్లాడే హక్కు లేదాయని టిడిపి నేతలు మండిపడ్డారు.. దీంతో వాగ్వాదం చోటుచేసుకుంది. శనివారం స్వామి దర్శనానికి అధికసంఖ్యలో భక్తులు వచ్చిన నేపథ్యంలో ఈ విషయం చర్చనీయాంశమైంది. కొంతసేపు తర్వాత టిడిపి నేతలు వెళ్లిపోవడంతో పరిస్థితి సద్దుమణిగింది.

కేంద్రం జోక్యం చేసుకోవాలి

సీతమ్మధార : చంద్రబాబు అక్రమ అరెస్ట్‌పై కేంద్రం జోక్యం చేసుకోవాలని తెలుగుశక్తి అధ్యక్షుడు బివి.రామ్ కోరారు. శనివారం టిపిటి కాలనీలోని బిజెపి ఉత్తర నియోజకవర్గ కార్యాలయంలో ఆపార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.విష్ణుకుమార్‌రాజును కలిసి వినతిపత్రం సమర్పించారు.దీనిపై విష్ణుకుమార్‌రాజు స్పందిస్తూ, చంద్రబాబు అరెస్ట్‌తో బిజెపికి ఎటువంటి సంబంధం లేదని, అరెస్ట్ జరిగిన తీరు దుర్మార్గమన్నారు దీనిపై ఇప్పటికే పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్లామన్నారు. దేశ ప్రధాని హోదాలో మోడీ శంకుస్థాపన చేసిన అమరావతి రాజధానిని ముఖ్యమంత్రి జగన్ మూడుముక్కలాటతో నిర్వీర్యం చేశారని, అమరావతి పరిరక్షణ చారిత్రాత్మక అవసరమని పి.విష్ణుకుమాం రాజు అన్నారు. కార్యక్రమంలో బోడేపూడి దొరబాబు, దువ్వి పరమేశ్వరరావు, కెవెన్.ప్రసాద్‌చౌదరి, సుంకర ప్రతాప్, పి.మురళి మోహన్, బి .వెంకటేశ్వరరావు, సన్ మూర్తి పాల్గొన్నారు.

'కాంతితో క్రాంతి' నిరసన

పిఎం పాలెం: .పిఎం పాలెం రెండో బస్‌స్టాప్ వద్ద తెలుగు యువత విశాఖ పార్లమెంటరీ ఉపాధ్యక్షులు గరె గురునాథ్ ఆధ్వర్యంలో కాంతితో క్రాంతి, వైసిపి గుడ్డి ప్రభుత్వం కళ్లు తెరిపిద్దాం అంటూ వినూత్న నిరసన చేపట్టారు. మోకాళ్లపై నిలబడి, సెల్‌ఫోన్ లైట్లు, వెలిగించిన కొవ్వొత్తుల కాంతిలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ఆరో వార్డు బిసి సెల్ అధ్యక్షుడు రెడ్డి సత్యనారాయణ, కె.రామకృష్ణ, బాబ్జీ, అబ్దుల్ భాషా, రౌతు వెంకటరమణ, పోతిన రమణ, వేణు, పిల్లా శ్రీను, పోతిన నాయుడు పాల్గొన్నారు.

కోటవురట్ల: చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా శనివారం మండల వ్యాప్తంగా పలు గ్రామాలలో కాంతిలో క్రాంతి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. పాములవాక గ్రామంలో టిడిపి సీనియర్ నాయకులు భాస్కరరావు ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శన చేపట్టారు.

ఎస్ రాయవరం: చంద్రబాబు అక్రమ అరెస్ట్‌కు నిరసనగా మండల కేంద్రంలో మాజీ సర్పంచ్‌కందుల వెంకటేశ్వరరావు, వెంకటాపురంలో మండల పార్టీ అధ్యక్షులు అమలకంటి అబద్ధం ఆధ్వర్యంలో కాంతిలో క్రాంతిలో భాగంగా కొవ్వొతులతో నిరసన తెలిపారు. కోనవానిపాలెం, సర్వసిద్ధి, బంగారమ్మపాలెం, గ్రామాలలో

బుచ్చెయ్యపేటలో కాగడాలతో టిడిపి నిరసన

నిరసన చేపట్టారు. కార్యక్రమంలో కోన అప్పలరాజు, కోన రామ్మోహనరావు, కర్రి శ్రీను, మడగల బుజ్జి, మద్దాల లక్ష్మణరావు, సర్వసిద్ధి మాజీ సర్పంచ్ పడమటి సతీష్ పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : చంద్రబాబును తక్షణమే విడుదల చేయాలని కోరుతూ మండలంలోని పలు గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ శ్రేణులు శనివారం రాత్రి కాగడాలు, కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. బుచ్చయ్యపేట, రాజాం, సీతయ్యపేట, పెదపూడి, చింతపాక తదితరు గ్రామాల్లో ఇళ్లలో లైట్లు ఆర్పి, కాగడాలు, కొవ్వొత్తుల వెలిగించి నిరసన తెలిపారు. టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్య బాబు, నాయకులు డొంకన అప్పలనాయుడు, గోకవాడ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

భానోజీతోటలో పట్టపగలే చోరీ

ప్రజాశక్తి -గాజువాక: జివిఎంసి 65వ వార్డు పరిధి బిసి.రోడ్డు భానోజీతోట రెండవ లైన్‌లో శనివారం ఉదయం చోరీ జరిగింది. ఇంట్లో లేని సమయంలో షేక్ హుస్సేన్ ఇంట్లో చోరీ జరిగింది. ఈ చోరీలో ఐదు తులాలు బంగారం, 30 తులాలు వెండిచోరీ జరిగినట్లు పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. దీనిపై న్యూపోర్ట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

పింఛను డబ్బులతో ఉద్యోగి మాయం

ప్రజాశక్తి -గాజువాక : పింఛను లబ్ధిదారులకు పంచాల్సిన డబ్బులతో సచివాలయ వెల్ఫేర్ మాయమైన ఘటన జివిఎంసి 65వ వార్డు సంజీవిగిరి కాలనీ సచివాలయంలో చోటు చేసుకుంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించి వివరాలివి.
ప్రతినెలా మాదిరిగానే ఒకటో తేదీన పింఛన్లను లబ్ధిదారులకు పంచే ప్రక్రియలో భాగంగా సంజీవిగిరి కాలనీ వెల్ఫేర్ సెక్రటరీ విల్సన్‌కు కూడా యుసిఇ అధికారులు డబ్బులు అందజేశారు. రెండు క్లస్టర్లపరిధిలో లబ్ధిదారులకు పంపిణీకి రూ.1,40,500 అందజేయగా, ఇప్పటివరకు సంబంధిత లబ్ధిదారులకు పింఛను సొమ్ములు పంపిణీ చేయలేదు. దీనిపై అధికారులకు కూడా సమాచారం తెలియలేదు. విషయం తెలిసిన వెంటనే సంబంధిత వెల్ఫేర్ సెక్రటరీ కోసం యుసిడి విభాగం అధికారులు ఆరా తీయగా అందుబాటులో లేకపోగా, ఫోన్ సిచ్చాఫ్ చేసిఉంది. ఏం జరిగిందో తెలియని పరిస్థితుల్లో దీనిపై పోలీసులకు ఫిర్యాదుచేశారు. కేసు నమోదు చేయాల్సి ఉంది

అనధికార నిర్మాణం తొలగింపు

అనధికార నిర్మాణం తొలగిస్తున్న సచివాలయ సిబ్బంది

ప్రజాశక్తి- ఆనందపురం: మండలంలోని వేములవలస పంచాయతీ బిసికాలనీలో కోరాడ సన్యాసిరావు అనే వ్యక్తి అనధికారికంగా నిర్మించిన మూడో అంతస్తును, వివాదాస్పద గోడను శనివారం గ్రామసచివాలయ సిబ్బంది తొలగించారు. అనుమతులు లేకుండా మూడో అంతస్తు నిర్మించడంతోపాటు, పక్కనే ఉన్న మల్లెపు నాగేశ్వరి ప్లాట్‌లోని మూడు అడుగుల మేర ఆక్రమించి నిర్మాణం చేపట్టారని నాగేశ్వరి ఫిర్యాదు మేరపు పరిశీలన జరిగిన అధికారులు ఈమేరకు అక్రమ నిర్మాణం తొలగించారు. గ్రామపంచాయతీ కార్యదర్శి పి.నర్సింగరావు ఆధ్వర్యంలో అనుమతుల్లేని అంతస్తుతోపాటు, పక్కప్లాటులో ఆక్రమించిన స్థలాన్ని తొలగించారు. అనధికార నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని పంచాయతీ కార్యదర్శి నర్సింగరావు హెచ్చరించారు.

వైసిపిలో చేరిక

నాగమల్లేశ్వరిని పార్టీలోకి స్వాగతిస్తున్న వైవి.సుబ్బారెడ్డి

ప్రజాశక్తి -మధురవాడ: నగరానికి చెందిన బిజెపి నేత డాక్టర్ మంచా నాగమల్లేశ్వరి శనివారం వైసిపిలో చేరారు. ఎండాడలోని పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షులు కోలా గురువులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి పార్టీ కండువా వేసి ఆమెను వైసిపిలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాగమల్లేశ్వరి మాట్లాడుతూ, వైసిపి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, సిఎం జగన్ మహిళలకు ఇస్తున్న ప్రాధాన్యత నచ్చి వైసిపిలో చేరానన్నారు. నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాస రావు, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, వంశీకృష్ణ శ్రీనివాస్, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కెకె.రాజు పాల్గొన్నారు.

సముద్ర పరిశోధనలపై 'గీతం'లో సదస్సు

ప్రజాశక్తి - మధురవాడ: సముద్ర వనరులు, ఆక్వాకల్చర్ రంగంలో పరిశోధనలు, వ్యాపార అవకాశాలపై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ సైన్స్ బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక సదస్సు నిర్వహించారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ, సెంట్రల్ ఫిషరీస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ అండ్ టెక్నాలజీ ఇనిస్టిట్యూట్ సంయుక్త ఆధ్వర్యాన గీతంలో నిర్వహించిన సదస్సుకు అధ్యక్షత వహించిన శాంతి సవ్వరూప్ భట్నాగర్ అవార్డు గ్రహీత, గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కృష్ణ మాట్లాడుతూ గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో 31 మంది పరిశోధకులు సముద్ర సంబంధ పరిశోధనలో నిమగ్నమై ఉన్నార న్నారు. బయో ఫ్యూయల్స్, బయో రెమిడీయేషన్, వేస్ట్ మేనేజ్మెంట్, సముద్రాల నుంచి ఔషధాల తయారీ వంటి పరిశోధనలు గీతం వర్సిటీలో జరుగుతున్నాయని, కేంద్ర పరిశోధనా సంస్థలతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామనివెల్లడించారు.

సెంట్రల్ ఫిషరీస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ యు.శ్రీధర్, డాక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ, ఆక్వా కల్చర్ రంగంలో అభివృద్ధి చేసిన నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వివరించారు. ఇటీవల కాలంలో సముద్ర రంగంపై తాము జరిపిన పరిశోధనలు, దీనికి సంబంధించి ఉన్న అవకాశాలను వెల్లడించారు.

నేషనల్ ఇపిస్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ డైరక్టర్ డాక్టర్ వివిఎస్.శర్మ, సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ దామోదర్ బెల్లి షెనాయ్, డాక్టర్ జగదీష్ లోకనాథం, డాక్టర్ టిఎన్ఆర్.శ్రీనివాస్ మాట్లాడుతూ,సముద్ర అధ్యయనాల ప్రాధాన్యతను వివరించారు.గీతం స్కూల్ సైన్స్ మైక్రో బయాలజీ, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం సీనియర్ ప్రొఫెసర్ ఆర్ జ్ఞానప్రసూన, డాక్టర్ సమత బ్రాంచ్ గోపాల్, డాక్టర్ గార్గి గోస్వామి తాము చేస్తున్న పరిశోధనలు వివరించారు. గీతం రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డైరెక్టర్ డాక్టర్ రాజాఫణిపప్పు, గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వేదవతి, బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ ఎం.అనిత పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాలాక్షినగర్, దయాల్‌నగర్‌లో దయాల్‌బాగ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్‌లో వృత్తి విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. డ్రెస్ డిజైనింగ్ అండ్ టైలరింగ్ (స్త్రీలకు), టెక్స్‌టైల్ డిజైనింగ్ అండ్ ప్రింటింగ్, మోటార్ వెహికిల్ మెకానిక్ (ఫోర్ వీలర్స్ అండ్ టూ వీలర్), ఆఫీస్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. డిఇఐ ఇన్‌ఫర్మేషన్ సెంటర్, దయాల్‌నగర్, విశాలాక్షినగర్, విశాఖపట్నం-43 చిరునామాకు దరఖాస్తులు పంపాలన్నారు. మరిన్ని వివరాల కోసం 9963340611 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

దుర్గాదేవి ఉత్సవాలకు రాట మహోత్సవం

ప్రజాశక్తి - ఆరిలోవ : 12వ వార్డు పెదగదిలి దుర్గాదేవి నవరాత్రుల ముహర్తపు రాట శనివారం ఎపి రాష్ట్ర సాంస్కృతిక విభాగం డైరెక్టర్ ధూళి రఘు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ నెల 15 నుంచి 28 వరకు దసరా నవరాత్రుల ఉత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో గురు భవాని కప్ప అభిరామ్, కోలా బంగారయ్య, బొట్ట అప్పలరాజు, కనకరాజు, దువ్వి సంతోష్ పాల్గొన్నారు.

కేసుల పరిష్కారంలో మధ్యవర్తిత్వం కీలకం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి గిరిధర్

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి గిరిధర్

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : కేసుల పరిష్కారంలో మధ్యవర్తిత్వం కీలకమని, సెక్షన్ 89 సివిల్ ప్రొసీజర్ కోడ్ ప్రకారం కేసులు రాజీ చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ జిల్లా అధ్యక్షుడు ఆలపాటి గిరిధర్ అన్నారు. శనివారం రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాలతో జిల్లాలోని న్యాయాధికారులు, న్యాయవాదులకు మధ్యవర్తిత్వంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కేసులు పరిష్కరించకోకుంటే పర్యావసానాలను వివరించారు. ఆరవ అదనపు న్యాయమూర్తి సువర్ణరాజు మధ్యవర్తిత్వ చట్టంలోని వివిధ అంశాలను వివరించారు.

జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి,రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.వెంకటరమణ, సిబిఐ కోర్టు న్యాయమూర్తి సిఎన్.మూర్తి మధ్యవర్తిత్వ చట్టంలోని వివిధ అంశాలపై మాట్లాడారు. కమర్షియల్ కోర్టు న్యాయమూర్తి కేశవాచార్యులు కమర్షియల్ కేసుల్లో మధ్యవర్తిత్వ ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయమూర్తులు, సీనియర్, జూనియర్ సివిల్ జడ్జిలు, మెజిస్ట్రేట్‌లు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, బార్ కౌన్సిల్ ప్రతినిధి కృష్ణమోహన్ పాల్గొనగా, అనకాపల్లి, అల్లూరి జిల్లాల న్యాయమూర్తులు ఆన్‌లైన్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

21న జాతీయ లోక్ అదాలత్

మాట్లాడుతున్న న్యాయమూర్తి షణ్ముఖరావు

ప్రజాశక్తి -గాజువాక: ఈనెల 21న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని 13వ జిల్లా జడ్జి షణ్ముఖరావు కోరారు. శనివారం గాజువాక కోర్టు కాంప్లెక్స్ ఆవరణలో సమావేశంలో మాట్లాడుతూ, జాతీయ లోక్ అదాలత్‌లో ఇన్సూరెన్స్, రెవెన్యూ ఇతరత్రా కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలని సూచించారు. కక్షిదారులు లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కెవి.స్వామి, న్యాయమూర్తులు ఇ. రాజేంద్రబాబు, శ్రీలక్ష్మి , జూనియర్ సివిల్ జడ్జి ప్రేమలత, బార్ అసోసియేషన్ న్యాయవాదులు, ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు, గాజువాక, పెదగంట్యాడ తహశీల్దార్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సామాజిక భవనం మంజూరుకు వినతి

వినతిపత్రం అందజేస్తున్న నగర కులస్తులు

ప్రజాశక్తి -మధురవాడ : నగరాల సామాజిక అవసరాల కోసం కమ్యూనిటీ భవనం మంజూరు చేయాలని నగరాల సామాజికవర్గం అఖిలపక్ష సభ్యులు కోరారు శనివారం ఎండాడలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావులను కలిసి వినతిపత్రం అందజేసినట్లు నగరాల కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ పిల్లా సుజాత సత్యనారాయణలు తెలిపారు.

కార్యక్రమంలో విశాఖ జిల్లా నగరాల సంఘం అధ్యక్షుడు పోతిన వెంకటరావు, కార్యదర్శి జగుపిల్లి అప్పలరాజు, కార్పొరేషన్ డైరెక్టర్లు కొరికాని మోహనరావు, వాండ్రాసి శ్యామల, కురిటి లోహిత్, వివిధ పార్టీలకు చెందిన నగరాల సామాజిక వర్గం నేతలు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం, తాటితూరులో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి టిడిపి నేతలు శనివారం పరామర్శించారు. బాధితులకు రూ.15 వేలు నగదు, బియ్యం, బట్టలు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు డిఎన్ రాజు, పార్టీ నాయకులు పతివాడ రాంబాబు, కొమర రాము పాల్గొన్నారు

సాయం అందజేస్తున్న టిడిపి నేతలు

'సాయి గణపతి'లో ముగిసిన టెక్నికల్ వర్క్‌షాప్

వర్క్‌షాపులో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి- ఆనందపురం: మండలంలోని గిడిజాల వద్దనున్న సాయి గణపతి పాలిటెక్నిక్ కాలేజీలో వారం రోజులుగా నిర్వహిస్తున్న టెక్నికల్ వర్క్‌షాప్ శనివారం ముగిసింది.సిఎస్ఇ. ఇసిఇ, ట్రిపుల్ఇ విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన టెక్నికల్ వర్క్ షాప్స్ పలువురు నిపుణులు పాల్గొని విద్యార్థులకు సలహాలు సూచనలు అందజేసినట్లు కళాశాల కరస్పాండెంట్ ఎస్‌జవేణుగోపాల్ తెలిపారు. సిఎంఇ నిర్వహించిన క్లౌడ్ కంప్యూటింగ్ వర్క్‌షాప్‌కు భీమిలి ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ డాక్టర్ మురళీకృష్ణ, ఇసిఇ నిర్వహించిన ఎంబెడ్డింగ్ సిస్టమ్స్ వర్క్‌షాప్‌కు భీమిలి గవర్నమెంట్ పాలిటెక్నిక్ ఇసిఇ హెచ్‌ఒడి డాక్టర్ పద్మావతి, ఇఇఇ విభాగం నిర్వహించిన ఈవీ టెక్నాలజీ వర్క్‌షాప్‌కు విశాఖపట్నం ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ కెవిడి నరసింహారావు పాల్గొని, ఆయా విభాగాల్లో విద్యార్థులకు స్కిల్‌డెవలప్‌మెంట్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎల్ మహేశ్వరరావు, అకడమిక్ ఇన్‌ఛార్జి అమరేంద్ర, వివిధ విభాగాధిపతులు సత్యవతి, రాజేంద్ర, స్వరూప, సోమేశ్, అరుణ, శ్రావణి, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు

అంతరిక్ష వారోత్సవాల్లో ఉత్సాహంగా విద్యార్థులు

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం రఘు ఇంజనీరింగ్ కళాశాల వేదికగా నిర్వహిస్తున్న ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా శనివారం వివిధ అంశాలపై వ్యాసరచన, వక్తృత్వ, తది తర పోటీల్లో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన 4,100 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. క్విజ్ పోటీల్లో 1450 మంది, వ్యాస రచన పోటీల్లో 985 మంది, పోస్టర్ ప్రెజెంటేషన్‌లో 310 మంది, చిత్ర లేఖనంలో 1860 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాకెట్ ప్రయోగాలు, అంతరిక్ష పరిశోధనలకు సంబందించి విద్యార్థుల సందేహాలను ఇస్రో శాస్త్రవేత్త లు నివృత్తి చేశారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. ముగింపు ఉత్సవాలు ఈ నెల 8న నిర్వహించనున్నారు.

గెలుపొందిన విద్యార్థులతో హెచ్‌ఎం మురళీ మోహనరావు

వ్యాసరచన పోటీల్లో చిట్టివలస విద్యార్థుల ప్రతిభ

తగరపువలస: ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా రఘు ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో చిట్టివలస జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు హెచ్‌ఎం పొట్నూరు మురళీ మోహనరావు తెలిపారు. 6వ తరగతి విద్యార్థిని టి హర్షిణికి ద్వితీయ స్థానం, 9వ తరగతి విద్యార్థిని కె.యామిని తృతీయ స్థానం, టెన్త్ విద్యార్థి సిహెచ్.యశ్వంత్ ప్రోత్సాహక బహుమతి గెలుచుకున్నాడు. పెయింటింగ్ పోటీల్లో టెన్త్ విద్యార్థి పి గణేష్‌కు ప్రథమస్థానం, 6వ తరగతి విద్యార్థి ని పి కావ్యశ్రీ తృతీయ స్థానం, 7వ తరగతి విద్యార్థి జె దుర్గాశ్రావణి ప్రోత్సాహక బహుమతులు గెలుచుకున్న ట్లు హెచ్‌ఎం తెలిపారు. విజేతలను పాఠశాలలో అభినందించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి -గాజువాక: జివిఎంసి 87వ వార్డు కణితి కళింగ వీధిలో 'డాలీ ప్లేస్కూల్' ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు.. ఈసందర్భంగా ఇంటింటికీ మొక్కలను పంపిణీ చేశారు. మొక్కలు నాటడం, ప్లాస్టిక్ నిషేధం, పర్యావరణ కాలుష్యంపై అవగాహన కలిపించారు. కార్యక్రమంలో స్కూల్ యాజమాన్యం, ప్రిన్సిపాల్ మాధురి, వైస్ ప్రిన్సిపల్ బి శిరీష, రిటైర్ హెచ్‌ఎం రాజారావు, టీచర్స్ సుధామణి, భావి మండ. వార్డు వైసిపి అధ్యక్షులు బొడ్డ గోవింద్, ప్రగడ వేణుబాబు, ముద్దపు దామోదర్, ప్రగడ శ్రీనివాస్, దుగ్గపు దానప్పలు, దాక సత్తిబాబు. తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పెందుర్తి : కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి, వాటిని సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంపిపి ఎం.నాగమణి అన్నారు. శనివారం మండల్ పరిషత్ వద్ద 15పంచాయతీలకు మొక్కలను పంపిణీ చేవ్వూరు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని సూచించారు

మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపిపి నాగమణి

నావల్ డాక్‌యార్డు క్యాంటీన్ ఎన్నికల్లో ఐదోసారి ఎన్‌సిఇ జయకేతనం

విజయం సాధించిన ఎన్‌సిఇ ప్యానెల్ అభ్యర్థులకు అభినందన

ప్రజాశక్తి -ములగాడ : నావెల్ డాక్‌యార్డ్‌లో ప్రతిష్టాత్మకంగా జరిగిన క్యాంటీన్ మేనేజింగ్ కమిటీ ఎన్నికల్లో ఎన్‌సిఇ యూనియన్ జయకేతనం ఎగరేసింది. ఈఎన్నికలలో సిఐటియు, టిఎన్‌టియుసి, డిఐటియు, వైఎస్ఆర్‌టియుసి బలపరిచిన ఎన్‌సిఇ యూనియన్ అభ్యర్థులు మొత్తం ఐదు స్థానాలకు గాను మూడు స్థానాలు గెలిచి వరుసగా ఐదోసారి క్యాంటీన్ కమిటీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్‌సిఇ యూనియన్ ప్రధాన కార్యదర్శి పిననాగేశ్వరరావు మాట్లాడుతూ వరుసగా ఐదోసారి తమ యూనియన్‌ను గెలిపించిన కార్మికులకు ధన్యవాదాలు తెలిపారు. క్యాంటీన్ అభివృద్ధికి మరింత శ్రద్ధతో కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ ఎన్నికల్లో ఎన్‌సిఇ యూనియన్ నుండి పోటీ చేసిన జిఎ.స్వామి, జి శ్రీనివాసరావు, అంగ నానాజీ గెలుపొందారు.

51వ వార్డులో గడపగడపకూ...

బ్రోచర్లను అందిస్తున్న కెకె.రాజు

ప్రజాశక్తి- మాధవధార : 51వ వార్డు మాధవదార-2 సచివాలయం కళింగనగర్ ప్రాంతంలో ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, రాష్ట్ర నెడ్‌క్యాప్ చైర్మన్ కెకె.రాజు స్థానిక కార్పొరేటర్ రెయ్యి వెంకట రమణతో కలిసి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వ సంక్షేమ ఫలాలను వివరించార. ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. మండల ఇన్‌ఛార్జి కృష్ణారావు, అమర్ రెడ్డి, వసంతల అప్పారావు, డైరెక్టర్లు పైడి శ్రీను, దిడ్డి రమేష్, నాయకులు తిరుమలరావు, దమయంతి, పొన్నాడ అప్పారావు, శ్యామ్, వరలక్ష్మి, రత్నం, గణేష్, సాధు, వినోద్, రాణిచిన్ని, భాను, బాబూరావు, కళింగనగర్ గ్రామ పెద్దలు, సీనియర్ నేత భోగవల్లి గోవింద్, షేక్ బాబ్జి, హరి పాల్గొన్నారు.

జగన్ ఎందుకు కావాలో తెలియజెప్పండి

మాట్లాడుతున్న ఆడారి ఆనందకుమార్

ప్రజాశక్తి -కరాస: ఆంధ్రాకు జగన్ ఎందుకు కావాలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించి చెప్పాల్సిన అవసరం ఉందనిపశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ సూచించారు. శనివారం 52వ వార్డు ఎన్ఎడి కొత్తరోడ్డు ఉమియా భవన్‌లో 52, 56, 57 వార్డుల క్లస్టర్ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వాలంటీర్లు తో 'ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి' అన్నదానిపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వైసిపి పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించి చెప్పి, మళ్లీ జగన్‌ను ముఖ్యమంత్రిని చేసేలా ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, 57వ వార్డు కార్పొరేటర్ ముర్రు వాణి, మార్కెటింగ్ కమిటీ చైర్మన్ ఆల్ఫా కృష్ణ, 56వ వార్డు అధ్యక్షులు ఆడారి శ్రీను, క్లస్టర్ ఇంచార్జ్ పళ్ళ ఎర్నికుమార్, నాయకులు సురేష్, జియ్యాని మారుతి, శ్రీదేవి వర్మ పాల్గొన్నారు.

ల్యాండ్ పూలింగ్‌లో భూములిచ్చేది లేదు

తహశీల్దార్ కార్యాలయం వద్ద రైతుల ధర్నా

తహశీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బాధితులు

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి మండలం వేటజంగాలపాలెంలో సర్వే నెంబర్ 50లో ల్యాండ్ పూలింగ్‌లో తమ భూములను ఇచ్చేది లేదని బాధిత రైతులు స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం వారు తహశీల్దార్ కార్యాలయం ధర్నా చేసి తహశీల్దార్ గంగాధర్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నానుద్దేశించి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.బాలకృష్ణ మాట్లాడుతూ రైతుల భూములు తీసుకోవద్దని గౌరవ హైకోర్టు డబ్ల్యుపి 64/2020 పిల్ ద్వారా 2022 మార్చి 11న తన తీర్పులో తెలిపిందని, దానిప్రకారం వేటజంగాలపాలెంలో సుమారు 40 మంది రైతులు భూముల్లో జీడి మామిడి తోటలను వదిలివేయడం జరిగిందని పేర్కొన్నారు. ఇప్పుడు వాటిని రెవెన్యూ, ఉడా అధికార్లు స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. గత 60 సంవత్సరాలు నుంచి పేదల స్వాధీనంలో ఉన్న భూములను ఇప్పుడు బలవంతంగా లాక్కుంటే ఊరుకోనేది లేదన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు మాట్లాడుతూ ప్రభుత్వం చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జీవో 72ను భూములకు వర్తింపజేయవద్దని కోరారు. హైకోర్టు తీర్పును ఉల్లంఘిస్తున్న అధికారులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎ.పి.దళిత బహుజన శ్రామిక యూనియన్ జిల్లా కన్వీనర్ కొల్లి సత్యారావు, భూ నిర్వాసితుల ల్యాండ్ పూలింగ్ రైతు కూలీ సంక్షేమ సంఘం అధ్యక్షులు గంటా శ్రీరామ్, కొల్లి సత్యారావు, రాజాన గోవిందు, బొడ్డ కాసులు, మాజీ ఎంపిటిసి తేలపు గోవిందరావు, బోడ్డు సత్తిబాబు, ముక్కల రాము, దుర్గమ్మ, అప్పలనర్స, సీతారాం, తమ్మిన సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

బకాయి జీతాలు చెల్లించాలని నిరసన

ప్రజాశక్తి - యలమంచిలి : బకాయి పడ్డ జీతాలు చెల్లించాలని కోరుతూ ఎస్ఎస్ఎ ఉద్యోగులు స్థానిక కొత్తపేట ఉన్నతపాఠశాలలో నల్లబ్యాడ్జీలు ధరించి, శనివారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు నెలలుగా జీతాలు రాక అనేక అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు చెల్లించాలని కోరుతూ గాంధీ జయంతి ఈ నెల 2 నుండి ప్రతిరోజూ నిరసన తెలియజేస్తున్నా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న తమకు సకాలంలో జీతాలు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్-ఎస్ఎ ఉద్యోగులు రాజేశ్వరి, అపర్ణ, విజయ, రమణమ్మ, మహాలక్ష్మి, కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

కన్సల్టేటివ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న ఎంపీ

ప్రజాశక్తి-అనకాపల్లి : న్యూఢిల్లీలోని జవహర్ లాల్ నెహ్రూ భవనంలో కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో శనివారం జరిగిన కన్సల్టేటివ్ కమిటీ మీటింగ్‌లో అనకాపల్లి పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బివి.సత్యవతి పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన జీ20 సదస్సులో తీసుకున్న నిర్ణయాలు కేంద్ర విదేశాంగ మంత్రి జై శంకర్ కమిటీ సభ్యులకు వివరించారు. ఎంపి సత్యవతి మాట్లాడుతూ జీ20 సదస్సు వలన భారతదేశం ప్రపంచ దేశాలతో ఒకటిగా నిలుస్తుందని, ఇటువంటి సదస్సుల వలన మన భారతదేశం అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు, విదేశాంగ మంత్రిత్వ శాఖ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వ్యాపారులు నిర్ణీత వేళలు పాటించాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : వ్యాపారస్తులు నిర్ణీత వేళలు పాటించాలని అచ్యుతాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తిరుమలరావు ఆదేశించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో శనివారం వ్యాపారస్తులతో ఆయన అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రాత్రి పది గంటలకు తమ షాపులు మూసివేయాలని సూచించారు. షాపులకు మెయిన్ రోడ్డు కవర్ అయ్యేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. మెగా షాపులు వద్ద సెక్యూరిటీ గార్డు నియమించాలని, మండల కేంద్రంలోని గ్రామాలలో అనుమానిత వ్యక్తులు ఎవరైనా సంచరించినట్లు ఉంటే వారి సమాచారం వెంటనే తెలియజేయాలని కోరారు. ఆన్‌లైన్ మోసాల గురించి పిల్లలకు పెద్దలకు అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

21న ప్రత్యేక లోక్ అదాలత్

ప్రజాశక్తి-చోడవరం : ప్రత్యేక లోక్ అదాలత్ ఈనెల 21వ తేదీన నిర్వహిస్తున్నామని, కక్షిదారులందరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జడ్జి కె.రత్నకుమార్ అన్నారు. శనివారం చోడవరం కోర్టు హాల్లో ఏడు మండలాల తహసీల్దార్లు, ఇన్సూరెన్స్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక లోక్ అదాలత్‌లో రెవెన్యూ, మోటార్ వెహికల్ ఇన్సూరెన్స్‌కు సంబంధించిన కేసులు పరిష్కారం కోసం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆయా మండలాల అధికారుల పరిధిలో ఉన్న కేసుల పరిష్కారానికి అవకాశం కలుగుతుందన్నారు. కావున కక్షిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సివిల్ జడ్జి ఎస్ అరుణశ్రీ, ఏజీపీ సుబ్బలక్ష్మి, ఏపీపీ వెంకటరావు, చోడవరం తహశీల్దార్ బి. తిరుమల బాబు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ఇక అధికారంలోకి రాడు

రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్

మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి అమర్‌నాథ్

ప్రజాశక్తి-అనకాపల్లి

చంద్రబాబు నాయుడు బతికున్నంత కాలం అధికారంలోకి రాలేదని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. నవంబర్ ఒకటవ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభం కానున్న 'ఎందుకు ఆంధ్రకి జగనన్న కావాలి' అన్న కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులకు వివరించే కార్యక్రమం అనకాపల్లి మండలం మార్టూరు గ్రామంలో శనివారం జరిగింది. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి అమర్నాథ్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు 14 సంవత్సరాల పాటు ముఖ్యమంత్రిగా ఉండి రాష్ట్రానికి ఎటువంటి ప్రయోజనం చేకూరలేదన్నారు. పైగా ఆయన ఇచ్చిన హామీలేవీ అమలుకు నోచుకోలేదని పేర్కొన్నారు. జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు 98శాతం అమలు చేసినట్లు చెప్పారు. చంద్రబాబు వివిధ నేరాలలో ఇరుక్కుని జైలుకు వెళ్లాడని, ఈ విషయాన్ని న్యాయస్థానం కూడా నమ్ముతోంది కాబట్టే ఆయనకు బెయిల్ ఇవ్వటం లేదని పేర్కొన్నారు. చంద్రబాబుతో పవన్ కళ్యాణ్ పొత్తు అక్రమ సంబంధాన్ని తలపిస్తోందని అమర్నాథ్ ఘాటైన విమర్శలు చేశారు. జగన్మోహన్ రెడ్డి తిరిగి అధికారంలోకి వస్తే పథకాలు మరింత సమర్థవంతంగా కొనసాగుతాయని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీఐడబ్ల్యూసీ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, వైసిపి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, జిల్లా పరిషత్ వైస్ చైర్పర్సన్ బీవీ సత్యవతి, ఎంపిపి గొర్లి సూరిబాబు, మలసాల కిషోర్, కలగా గున్నయ్య నాయుడు, వైస్ ఎంపీపీ అయిత ఆనంద రాము, సర్పంచు రెవిన్యూ నాయుడు, ఎంపిటిసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో ఓడితే

మొదట ఇంటిదారి పట్టేది వాలంటీర్లే

యలమంచిలి ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

ప్రజాశక్తి - యలమంచిలి

వైసిపి ప్రభుత్వం చేసిన సంక్షేమ కార్యక్రమాలను వాలంటీర్లు ప్రజలకు వివరించి, వారికి నచ్చజెప్పి రాబోయే ఎన్నికల్లో వైసిపి విజయానికి కృషి చేయాలని, ఫలితాలు తారుమారైతే మొదటిగా ఇంటిదారి పట్టేది వాలంటీర్లేనని యలమంచిలి ఎమ్మెల్యే యువి.రమణమూర్తి రాజు అన్నారు. శనివారం స్థానిక గురప్ప కల్యాణమండపంలో ఏర్పాటు చేసిన సభలో వాలంటీర్లనుద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ వాలంటీర్లు జగన్ కుటుంబ సభ్యులని, కుటుంబ పెద్దని మనం కాపాడుకోవలసిన అవసరం ఉందని పేర్కొన్నారు. రాష్ట్రానికి తిరిగి జగనే ముఖ్యమంత్రి కావాలంటే ప్రభుత్వం ప్రతి ఇంటికి చేసిన ఉపకారం గుర్తు చేస్తూ వారికి నచ్చజెప్పాలని సూచించారు. ఎమ్మెల్యే తనయుడు సుకుమార్ వర్మ మాట్లాడుతూ నవంబర్ 1తేదీ నుంచి ప్రతి వాలంటీర్ పరిధిలోని ఇళ్లను రోజుకు పది చొప్పున ఎంచుకొని స్థానిక పార్టీ నాయకులతో ఆ కుటుంబ సభ్యులతో గడిపి ఓటర్లను ప్రసన్నం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ పిల్లా రమాకుమారి, పిఎసిఎస్ చైర్మన్ మళ్ల కొండబాబు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షురాలు రాజాన మహాలక్ష్మి, కర్రి శివ, ఎంపిపి బోదెపు గోవిందరావు, బొద్దపు ఎర్రయ్యదొర, 400 మంది వాలంటీర్లు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

చంద్రబాబు కేసుపై పూటకో మాట : నాగజగదీష్

ప్రజాశక్తి-అనకాపల్లి : టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుపై స్కిల్ డెవలప్మెంట్ కేసులో వైసిపి ప్రభుత్వం పూటకో మాట మాట్లాడుతుందని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు విమర్శించారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రూ.3308 కోట్లు అవినీతి జరిగిందని ఒక్కసారి, రూ.371 కోట్లు స్కామ్ చేశారని, ఇప్పుడు రూ.271 కోట్లు అవినీతి జరిగిపోయిందని సిఐడి అధికారులు 409 సెక్షన్ పెట్టి అక్రమ కేసులు బనాయించి 29 రోజులుగా జైల్లో ఉంచి ఇప్పుడు కేవలం రూ.27 కోట్లు మాత్రమే అవినీతి జరిగిందని సీబీఐ కోర్టుకు అబద్ధాలు చెబుతుందని తెలిపారు. 2019 ఎన్నికల్లో వ్యవస్థలను మేనేజ్ చేసి అక్రమ మార్గంలో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ, ప్రభుత్వ అవినీతి అక్రమాలను వెలుగులోకి తీసుకువస్తున్న ప్రతిపక్ష టిడిపి నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతుందని విమర్శించారు. విలేకరుల సమావేశంలో టిడిపి జిల్లా కార్యదర్శి కుప్పిలి జగన్, జిల్లా నిర్వాహక కార్యదర్శి బోడి వెంకటరావు, జిల్లా బీసీ సెల్ అధికారప్రతినిధి విల్లూరి రమణ బాబు పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న మురళీకృష్ణ తదితరులు

జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

ప్రజాశక్తి - పరవాడ

పరవాడ సంస్కృతి గ్లోబల్ స్కూల్, పరవాడ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి బాల, బాలికల అండర్ 14, అండర్ 17 బ్యాడ్మింటన్ పోటీలు శనివారం ముగిశాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీస్ టి.నాగేశ్వరరావు, అనకాపల్లి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎంవి.నాగేశ్వరరావు, ఎస్ఎస్ఆర్ పి.సూరిబాబు ఆధ్వర్యంలో జరిగిన అండర్ 14 పోటీలను స్థానిక ఎమ్మెల్యే అదీప్ రాజు, అండర్ 17 పోటీలను అంతర్జాతీయ శిక్షకులు ఎంవివి మురళీకృష్ణ ప్రారంభించారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారు. ఈ పోటీలను నిర్వహించిన సంస్కృతి గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.సీతలక్ష్మి, సీఈఓ కె.నిశాంత్, స్పోర్ట్స్ డైరెక్టర్ జి. మధుబాబుకు అనకాపల్లి స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎంవి. నాగేశ్వరావు కృతజ్ఞతలు తెలిపారు.

గొన్న కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి. - పరవాడ : మండలంలోని గొన్న కళాశాలలో పవర్ రివ్యూస్ క్యాంపస్ ఇంటర్వ్యూలు శనివారం నిర్వహించారు. పోస్ట్-కాలేజ్ ట్రైనర్, బిటెక్, ఎంటెక్, ఎంబిఎ విద్యార్థులు 89 మంది హాజరయ్యారు. కంపెనీ యాజమాన్యాలు ఇంటర్వ్యూ నిర్వహించి 20 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా గొన్న కళాశాల సెక్రెటరీ గొన్న హేమచంద్‌నాయుడు మాట్లాడుతూ కళాశాలలో వచ్చే ప్రతి ఒక్క అవకాశాన్ని విద్యార్థులు తప్పక వినియోగించుకొని వారి జీవితంలో అభివృద్ధి చెందాలని సూచించారు. విద్యార్థులు తమ జీవితాలలో ఉన్నత శిఖరాలను అందుకోవాలని యాజమాన్యం కోరుకుంటుందని చెప్పారు. ఎంపికైన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

8న కళాకారుల సమస్యలపై రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి- దేవరాపల్లి : కళాకారుల సమస్యల సాధనకై ఈనెల 8న భీమవరంలో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు బహుజన కళామండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.ఉదయ భాస్కర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కాటపల్లి అప్పారావు శనివారం ఒక పర్యటనలో తెలిపారు. 40 సంవత్సరాలు నిండిన ప్రతి కళాకారులకు ప్రతి నెల రూ.5000 పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న ఉద్యమంలో భాగంగా తొలిసారి భీమవరంలో నిర్వహిస్తున్న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని వారు కోరారు.

కొత్తపెంటలో శ్రమదానం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని కొత్తపెంట గ్రామంలో గ్రామస్తులందరూ ఏకమై స్థానిక ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో శనివారం శ్రమదానం నిర్వహించారు. మహిళలు, యువకులతో పాటు వృద్ధులు పాల్గొని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు సమక్షంలో రోడ్లకు ఇరువైపులా పేరుకుపోయిన పొదలను, తుప్పలు, డొంకలను తొలగించారు. ఉపముఖ్యమంత్రి స్వగ్రామం తారువలో ఈ నెల 2న నిర్వహించిన శ్రమదానం కార్యక్రమం స్ఫూర్తితో కొత్తపెంట గ్రామంలో ఈ కార్యక్రమం నిర్వహించామని స్థానికులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడుతో పాటు గ్రామ సర్పంచ్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డు తయారీపై అవగాహన

ప్రజాశక్తి-అనకాపల్లి : దాడి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ కళాశాలలో ఈసీఈ, ఈఈఈ విభాగాల ఆధ్వర్యంలో ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డ్ తయారీపై ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో వారం రోజులపాటు నిర్వహించిన అవగాహన కార్యక్రమం శనివారం ముగిసింది. రిసోర్స్ పర్సన్ ఏపిఎస్ఎస్‌డిసి ఇంజినీర్ జి.శిరీష, డీన్ అకాడమిక్స్ డాక్టర్ కె.పార్వతి పిసిబి డిజైన్ ప్రాముఖ్యతను తెలియజేశారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ ఈసీఈ, ఈఈఈ విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రాజెక్ట్ ఇంజినీర్ బి. శేషగిరిరావు, పిసిబి డిజైనింగ్‌లో మెళకువలు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆర్ వైకుంఠరావు, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ పి.పూర్ణ ప్రియ, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ ఎ.ఎస్.ఎల్.కె.గోపాలమ్మ, డిప్లొమా కో ఆర్డినేటర్ ఎన్.సరిత రాణి, ఈసీఈ హెచ్ఓఎస్ బిటి అర్చన, ఈఈఈ హెచ్ఓఎస్ కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకోవాలి

ప్రజాశక్తి-చోడవరం : పర్యావరణ పరిరక్షణలో భాగంగా స్థానిక ఉషోదయ కళాశాల విద్యార్థులు, సిబ్బంది శనివారం స్థానిక కె.కాలనీ ప్రాథమిక పాఠశాలలో మొక్కల నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఉషోదయ కళాశాల చైర్మన్ జె.రమణాజీ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నేడు మొక్కలు నాటితే భవిష్యత్తులో పర్యావరణ సమతుల్యత ఉంటుందని చెప్పారు. సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి శంకరన్

ప్రజాశక్తి- అనకాపల్లి :బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి ఎస్ఆర్.శంకరన్ జీవితం ఒక్క ఆదర్శం కావాలని సామాజిక హక్కుల వేదిక జిల్లా గౌరవ అధ్యక్షుడు రాజాన దొరబాబు అన్నారు. శనివారం కొడుగంటి గోవిందరావు భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దొరబాబు మాట్లాడుతూ ఐఎఎస్ అధికారిగా ఉన్న శంకరన్ చాలా సాధారణ జీవితాన్ని కొనసాగించారన్నారు. బిసి, ఎస్సీ ఎస్టీ వర్గాల పిల్లలకు విద్య కోసం హాస్టల్స్ ఏర్పాటు చేయడంలో శంకరన్ ముఖ్య పాత్ర వహించారని తెలిపారు. వెనక బడిన వర్గాల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు రూపకల్పన చేశారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం శంకరన్‌కి పద్మభూషణ్ అవార్డు ప్రకటించిన దానిని సున్నితంగా తిరస్కరణ చేసిన సమాజంలో గొప్ప కీర్తి ప్రతిష్టలు గడించారన్నారు. వియ్యపు రాజు, నరాల శెట్టి సత్యనారాయణ, కోన లక్ష్మణ, బెన్నము నాయుడు, కొల్లి సత్యారావు, వియ్యపు రమణ, సంతోష్, సత్తిబాబు, పవన్, జానీ, నాగేష్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి పెరగనున్న ప్రాధాన్యత

ప్రజాశక్తి-అనకాపల్లి : రానున్న రోజుల్లో ప్రకృతి వ్యవసాయం అధిక ప్రాముఖ్యత వహిస్తుందని ప్రాంతీయ ప్రకృతి వ్యవసాయ అధికారి హేమ సుందర్ తెలిపారు. మండల సమాఖ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సార్వత్రిక సూత్రాలు ప్రకృతి వ్యవసాయంలో మహిళా సంఘాల పాత్ర, నేల ఆరోగ్యం పెంపు, పిఎంపిఎస్ నవధాన్యాలు సాగు, 365 రోజులు బహుళ పంటలు సాగు విధానంపై శనివారం అవగాహన కల్పించారు. పెరటి తోటల పెంపకం విధానం, లాభాలు ప్రకృతి వ్యవసాయం వనరుల కేంద్రం ద్వారా, ఇన్‌పుట్ సరఫరా, సామూహిక ఇన్‌పుట్ తయారీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా ప్రకృతి వ్యవసాయ మేనేజర్ స్వామి నాయుడు పాల్గొన్నారు.

'చలో అలంపూర్' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- సబ్బవరం : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ అలంపూర్ నుండి చేపట్టిన మాదిగల విశ్వరూప మహా పాదయాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు గోటివాడ సామ్రాట్ కుమార్ ఆధ్వర్యాన శనివారం మండలంలోని అమృతపురం గ్రామంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాదిగ ఉద్యోగుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు నీటిపల్లి ముత్యాలు మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఎస్‌సి వర్గీకరణ బిల్లును ప్రవేశ పెట్టాలనే డిమాండ్‌తో మంద కృష్ణ చేపట్టిన పాదయాత్రను జయప్రదం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దువ్వ దుర్గాలు, నీటిపల్లి గౌరి, గోటివాడ సన్యాసి, ముప్పిడి రాజు, గోటివాడ సన్యాసి, చరణ్, స్వామి ఎమ్మార్పీఎస్ నాయకులు, పాల్గొన్నారు.

భూముల రీ సర్వేపై గ్రామసభ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : సమగ్ర భూ సర్వేను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని కొండపాలెం గ్రామంలో మూడో విడత భూముల రీ సర్వే పనులకు సంబంధించి శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ సాగులోని భూముల వివరాలను అధికారులకు అందజేయాలని సూచించారు. తద్వారా రైతులకు సంబంధించిన వివరాలు పారదర్శకంగా నమోదవుతాయని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ముచ్చకర్ల భవాని, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు ముచ్చకర్ల తాతీలు పాల్గొన్నారు.

హిందీ భాష నేర్చుకోవాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : మన జాతీయ భాష హిందీని నేర్చుకోవడం వలన దేశంలో ఎక్కడైనా జీవించవచ్చని స్థానిక జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.రాధిక అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ అధ్యక్షతన శనివారం హిందీ భాష దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హిందీ భాష ప్రాముఖ్యత, రాజ భాష గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం ఐపిఈ 2023 సంవత్సరంలో జరిగిన పబ్లిక్ పరీక్షల్లో హిందీలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల హిందీ అధ్యాపకురాలు ఎస్.నిర్మల, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

పలుచోట్ల ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు

ప్రజాశక్తి-విలేకర్ల యంత్రాంగం

వైసిపి ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని పలు గ్రామాల్లో శనివారం వైద్య శిబిరాలు నిర్వహించారు.

దేవరాపల్లి : మండలంలోని గరిసింగి గ్రామలలో శనివారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కేంద్రాలను ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు శనివారం సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసిలు కర్రి సత్యం, ఈర్లె అనురాధ, కె.కోటపాడు ఎంపిపి రెడ్డి జగన్ మోహన్, వైసిపి నేత బూరె బాబురావు, వైద్యాధికారులు, మండల అధికారులు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని వంగలి గ్రామ సచివాలయం ఆవరణలో ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపిపి బోకం సూర్యకుమారి రామునాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిడివో రమేష్ నాయుడు, తహశీల్దార్ బి.సత్యనారాయణ, సర్పంచ్ ఆకుల గణేష్, శ్రీహేమ, ఎంపిటీసీ గవర రాజు, వైసిపి నాయకులు కోటాన రాము, సబ్బవరపు నారాయణమూర్తి పాల్గొన్నారు.

పరవాడ : మండలంలోని రావాడ పంచాయతీ పరిధి ధర్మారాయుడుపేటలో ఆరోగ్య సురక్ష శిబిరాన్ని స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు, సర్పంచ్ మోటూరు సన్యాసి నాయుడు, వైసిపి నేతలు కోన రామారావు, వెన్నెల సన్యాసిరావు పాల్గొన్నారు.

అనకాపల్లి : మండలంలోని రేబాక పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఎంపిపి గొర్లి సూరిబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరసింహారావు, ఈఓపిఆర్‌డి ధర్మారావు, సర్పంచ్ మార్టూరు సన్యాసమ్మ, ఎంపీటీసీ మంత్రి సంతోషం, మంత్రి సత్తిబాబు, మార్టూరు లక్ష్మణ్ పాల్గొన్నారు.

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం లోపూడి సచివాలయ పరిధిలో ఆరోగ్య సురక్ష శిబిరాన్ని స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ సందర్శించి మాట్లాడారు. కార్యక్రమంలో డిపిఒ శిరీషారాణి, ఎంపిడిఒ సువర్ణ రాజు, డాక్టర్ శకుంతల, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

కశింకోట : స్థానిక మండల కార్యాలయం వద్ద ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపిపి కలగా లక్ష్మి గున్నయ్య నాయుడు సందర్శించి మాట్లాడారు. వైద్యులు తిరుపతి రావు, యశోద రోగులకు తనిఖీ చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు మళ్ళ బుల్లి బాబు, వైస్ ఎంపిపి పెంటకోట జ్యోతి శ్రీనివాసరావు, సర్పంచ్ మంత్రి జయరజనీ, తశీల్దారు గండి సత్యనారాయణ, ఎంపిడిఒ రవికుమార్ పాల్గొన్నారు.

నక్కపల్లి : మండలంలోని బంగారమ్మపేట గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రం నూతన భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏవో సీతారామరాజు, వైసీపీ నేతలు శీరం నరసింహమూర్తి, సూరకాసుల గోవింద్, బాబూరావు పాల్గొన్నారు.

కోటవురట్ల : పేద ప్రజల ఆరోగ్య రక్షణకే జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు తెలిపారు. సుంకపూరు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేసి నట్లు తెలిపారు. సర్పంచ్ కాశీ లక్ష్మి, ఎంఈఓ జోష్ పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : మండలంలోని పెద్దప్పలం గ్రామంలో జిల్లా ఉన్నత పాఠశాలలో పెనుగొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన జగన్ ఆరోగ్య సురక్షలో సర్పంచ్ రమణ, ఎంపీడీఓ రామచంద్రమూర్తి, ఇఓఆర్‌డి సత్యనారాయణ పాల్గొన్నారు.

గొలుగొండ : మండలంలోని రావణాపల్లి ఎంపీపీ స్కూల్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహించారు. అంగన్వాడీ పోషకాహార స్టాల్స్‌ను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ డేవిడ్‌రాజు, ఈఓపిఆర్‌డి రఘురాం, పిఎసిఎస్ అధ్యక్షులు కిలపర్తి పెద్దిరాజు, ఎఎంసి చైర్మన్ కొల్లు సత్యనారాయణ, కొమిర సర్పంచ్ అల్లు రాజబాబు, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు కొల్లు అప్పలనాయుడు, కొల్లు రాము, కొల్లు గంగునాయుడు, కొల్లు లోవరాజు, మురుకుట్టి చిరంజీవి, పంచాయతీ సెక్రటరీ సాధనాల అప్పారావు పాల్గొన్నారు.

ఆనందపురం : మండలం బోని గ్రామసచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించారు. 644 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సురక్ష ప్రత్యేక అధికారి పద్మ ఎంపిడిఒ అడపా లవరాజు, తహశీల్దార్ లోకవరపు రామారావు, డాక్టర్లు గంగునాయుడు, సాంబమూర్తి, ఎఎంసి వైస్‌చైర్మన్ బోని అప్పలనాయుడు, సర్పంచ్ బోని అప్పలకొండ సన్యాసినాయుడు, ఎంపిటిసి బోని పార్వతి, బంక సత్యం, మజ్జి వెంకటరావు, బిఆర్‌బి నాయుడు, కర్రి నాయుడుబాబు, శనగం అప్పలరాజు, ఉప సర్పంచ్ ఏర్పింటి అరుణకుమారి పాల్గొన్నారు

గాజువాక.: 74వ వార్డు వియ్యపువానిపాలెం టిజిఆర్ నగర్ సచివాలయంలో ఆరోగ్య సురక్ష శిబిరాన్ని స్థానిక కార్పొరేటర్, వైసిపి సోషల్ మీడియా జిల్లాకన్వీనర్ తిప్పల వంశీరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో యుపిహెచ్‌సి డాక్టర్ జి.మానస, ఎఎన్ఎం టి.విజయకుమారి, ఆశా వర్కర్లు, వాలంటీర్స్ పి.హర్షలత, కె.తిరుపతి, పి.అనంతకుమార్ పాల్గొన్నారు..

పెందుర్తి : రాంపురంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సర్పంచ్ అన్నమరెడ్డి శిరీష ప్రారంభించారు. రోగులకు వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో అప్పారావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు

అరిలోవ : రెండవ జోన్ ఆరిలోవల బాలాజీనగరలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ప్రారంభించారు. డిఎంహెచ్ఒ డాక్టర్ జగదీశ్వరరావు మాట్లాడుతూ సచివాలయాల పరిధిలో 15 రోజులపాటు ఇంటింటా సర్వేచేసి, అనారోగ్యంతో బాధపడుతున్న వారి ప్రొఫైల్ సేకరించారని, వారికి ఆయా సచివాలయాల్లోనే స్పెషలిస్ట్ వైద్యసేవలు అందిస్తారన్నారు. ఆరోగ్య కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి జగనన్న ఆరోగ్య సురక్షిత కార్యక్రమం పై అవగాహన కల్పించాలని, ముఖ్యంగా జనరల్, గైనిక్, ఆర్థో, ఆప్తాలమిక్, డెంటల్ వైద్యనిపుణులు అందించే సేవలను సద్వినియోగ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్‌సి కనకమహాలక్ష్మి, ఎంఒహెచ్ఒ కిషోర్ పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష వెల వెల

కొత్తకోట : మండల, గ్రామ స్థాయి అధికారులతో పాటు గ్రామ వాలంటీర్ల నిర్లక్ష్యం కారణంగా కొత్తకోట సచివాలయం -1లో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం వెల వెల బోయింది. ఈ కార్యక్రమం లో పాల్గొన్న చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ప్రజల హాజరు చూసి గృహ సారధులతో పాటు వాలంటీర్లపై ఆగ్రహం వ్యక్తం చేయడం తో అప్పటికప్పుడు ప్రజలను రప్పించారు. రావికమతం మండలం లో మేజర్ పంచాయితీ కొత్తకోటలో మూడు సచివాలయాలు ఉన్నాయి. ఒక్కో సచివాలయం పరిధిలో సుమారు 7 వేలకు పై గా జనాభా ఉన్నారు.. ఇంత జనాభా కలిగినా శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి కేవలం 306 మంది రోగులు హాజరు కావడం విశేషం. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే హెచ్చరించారు. మరో రెండు సచివాలయాలు పరిధిలో జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ధర్మశ్రీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పైల రాజు, వైసిపి మండల అధ్యక్షులు గుమ్ముడు సత్యదేవ్, ముక్కా మహాలక్ష్మి నాయుడు, సర్పంచ్, ఉప సర్పంచ్ కొన లోవరాజు, పందల దేవ, ఎంపి టిసి పూడి దేవ, కె.శంకర్, పైల చిన్నమ్ములు, కె. గున్నాజీ తదితరులు పాల్గొన్నారు.

10న కొత్తపాలెంలో ఆరోగ్యసురక్ష వైద్యశిబిరం

గోపాలపట్నం : జీవిఎంసి 89వ వార్డు కొత్తపాలెంలో ఈనెల 10న నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైసిపి వార్డు అధ్యక్షుడు ఐతంశెట్టి రేణుక గోపాలకృష్ణ అన్నారు. శనివారం కొత్తపాలెంలో దీనిపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో ఎడిపి శ్రీరామ్, ఎంఎంహెచ్ఒ కృష్ణంరాజు, శానిటరీ సూపర్‌వైజర్ కె.వి రమణ, నేతలు ఆళ్ల పైడిరాజు కన్వీనర్ రమణ, పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష కంటితుడుపు వ్యవహారమేనా?

ప్రజాశక్తి - యలమంచిలి : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహణలో భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. జబ్బులు సర్వే జరిగినంత పటిష్టంగా రోగ నిర్ధారణ, మందులు పంపిణీ జరగలేదని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. రోగాలకు సురక్ష శిబిరంలో మంచి మందులిస్తారని ఆశిస్తే ప్రభుత్వాసుపత్రిలో ఇచ్చే బిళ్లలే ఇక్కడా ఇచ్చారని రోగులు పెదవి విరుస్తున్నారు. ఇదంతా కంటి తుడుపు వ్యవహారమేనని, ఎలక్షన్ ముందు ఆర్భాటంలా ఉందని కొందరంటున్నారు.

ఓట్ల తతంగంలా ఉంది

వారం పది రోజుల నుంచి మందుల గురించి ఊదరగొట్టారు. జబ్బుల నొప్పితో బాధపడుతున్నాను. స్పెషలిస్టు వస్తారన్నారు. కాని రాలేదు. మామూలు మందు బిళ్లలే వారం రోజులకు సరిపడా ఇచ్చారు. ఇదంతా ఓట్ల తతంగంలా ఉంది. నిజమైన సాయం అందలేదు.

- పైడిరాజు, పాతవీధి, యలమంచిలి

సాదాసీదా మందు బిల్లలే ఇచ్చారు

మోకాళ్ల నొప్పితో బాధపడుతున్నాను. కుస్తీలు పట్టి మరీ క్యూలో నిల్చొని మందులు తెచ్చుకున్నాను. తీరా చూస్తే వారిచ్చినవి సాదా సీదా మందు బిళ్లలే. ఈ మాత్రం దానికి గవర్నమెంటు ఆస్పత్రికెళ్లినా ఇస్తారు. ఇక్కడేదో గొప్ప జరుగుతుందనుకున్నాను.

- అప్పలనరస, ధర్మవరం, యలమంచిలి

బొగ్గు లారీల కాలుష్యం నుండి రక్షించాలని నిరాహార దీక్ష

ప్రజాశక్తి - పరవాడ

బొగ్గు లారీల కాలుష్యం నుండి రక్షించాలని కోరుతూ మండలంలోని లంకెలపాలెం జంక్షన్లో సుందరపు శ్రీనువాసరావు ఆధ్వర్యాన శనివారం ఒక్క రోజు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, తాడి గ్రామ తరలింపు పోరాట నాయకుడు బంతికోరు గోవిందు మద్దతు తెలియజేసి మాట్లాడారు. ప్రతిరోజు వందలాది లారీలు అధికలోడుతో ఎటువంటి తార్పాలు కట్టకుండా లంకెలపాలెం జంక్షన్ గుండా ప్రయాణిస్తున్నాయని తెలిపారు. ఈ బొగ్గు దుమ్మూధూళి వల్ల ఇక్కడ వ్యాపారస్తులు, స్థానికులు అనారోగ్యాలు పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం పూటల్లో ట్రాక్టర్‌తో నీరు చిలకరించాలని ఎన్నిసార్లు విన్నవించుకున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఈ సమస్యపై సుందరపు శ్రీనివాసరావు ముందుకొచ్చి నిరాహార దీక్ష చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.



దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు నేత గనిశెట్టి

2013 భూ సేకరణ చట్ట ప్రకారం

పరిహారం, ప్యాకేజీ చెల్లించాలి

నిర్వాసితులు ఆర్‌డిఒకు వినతి

ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేస్తున్న నిర్వాసితులు, రైతు సంఘం నేతలు

ప్రజాశక్తి-నక్కపల్లి: 2013 భూసేకరణ చట్టప్రకారం పూర్తిస్థాయిలో ప్యాకేజీ, పరిహారం చెల్లించాలని నిర్వాసితులు డిమాండ్ చేశారు. అమలాపురం పంచాయతీ మూలపర్ర గ్రామంలో శనివారం నర్సీపట్నం ఆర్డిఒ జయరాం, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎస్ త్రినాధరావు, తహసీల్దార్ అంబేద్కర్ లు నిర్వాసితులతో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ పై సమావేశం నిర్వహించారు. 458 మందిని ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి అర్హులుగా గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా నిర్వాసితులు, రైతులు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆర్డిఒకు అందజేశారు. మండలంలోని రాజయ్య పేట, బుచ్చిరాజుపేట, చందనాడ ,వేంపాడు, డిఎల్ పురం గ్రామాల రెవెన్యూ పరిధిలో వైజాగ్ -చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు 5500 ఎకరాల భూమిని ఏపీఐఐసీ అధికారులు సేకరించడం జరిగిందన్నారు. 2013 భూ సేకరణ చట్ట ప్రకారం అమలు చేస్తామని రైతులను, నిర్వాసితులను, పేదలను అన్ని విధాల ఆదుకుంటామని ఆనాటి అధికారులు హామీ ఇచ్చి భూసేకరణ చేయడం జరిగిందన్నారు. 7 సంవత్సరాలు అవుతున్నా నేటికీ పూర్తిస్థాయిలో రైతులను, నిర్వాసితులను ఆదుకోలేదన్నారు.2013 భూ సేకరణ చట్ట ప్రకారం 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి రూ.25 లక్షల ప్యాకేజీ చెల్లించాలని, జిరాయితీతో సమానంగా డీ పట్టా భూములకు, సాగు భూములకు పరిహారం చెల్లించాలని, చెట్లకు కొత్త జీవో 268 ప్రకారం పరిహారం చెల్లించాలన్నారు. డి పట్టా, సాగు భూముల్లో ఉన్న చెట్లు కూడా పరిహారం చెల్లించాలన్నారు. మూలపర్ర, పాటిమీద, రాజయ్యపేట ఎస్సీ కాలనీ, తమ్మయ్యపేట, తుమ్మలపేట, చందనాడలో క్రి విధి, బుచ్చిరాజుపేట కొత్తూరు, బోయపాడు గ్రామాలను పరిశ్రమ స్థాపన కోసం తొలగిస్తున్నారని, చాలా తక్కువ పరిహారం చెల్లించారని ,రీ సర్వే చేసి ,ప్రస్తుత వాస్తవ ధరకు అనుగుణంగా పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రామకంఠంలో ఉన్న ఇళ్లకు కూడా పరిహారం చెల్లించాలని కోరారు. తొలగించనున్న ఇళ్లకు చెల్లించిన నష్టపరిహారం సంబంధించి లక్షకు పది వేల చొప్పున ఇన్ కం టాక్స్ కింద తగ్గించారని, తగ్గించిన నగదును వెంటనే లబ్ధిదారులకు చెల్లించాలని కోరారు. ఇల్లులు కోల్పోతున్న వారందరికీ, వారి కోరినచోట ఒక్కొక్కరికి 10 సెంట్లు చొప్పున స్థలం కేటాయించి, ఇల్లులు నిర్మించి ఇవ్వాలని, నిర్వాసితులకు ఆర్ కార్డులు ఇవ్వాలని కోరారు .శ్రీ కనకమహాలక్ష్మి ఫిషర్మెన్ సొసైటీకు చెందిన సర్వే నెంబర్ 410/4,417,418 లలో 43.15 ఎకరాల భూమిని 1994 లో అప్పటి కలెక్టర్ 15 సంవత్సరాలు లీజుకు ఇవ్వడం జరిగిందన్నారు. నాటి నుండి నేటి వరకు మత్స్యకారులమంతా ఆ భూమిలో సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. జిరాయితీ భూములకు రైతులకు ఏ విధంగా నష్టపరిహారం చెల్లించారో అదేవిధంగా తమకు కూడా పరిహారం చెల్లించాలని మత్స్యకారులు కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, సర్పంచ్ శంకర్రావు, వైసిపి నాయకులు ఎన్.గోవిందరావు, టి.బార్గవ్, జి.నర్సింగరావు, టి.అప్పలస్వామి, వి.సత్తిబాబు రెవెన్యూ, ఏపీఐఐసీ అధికారులు పాల్గొన్నారు

ఎంపికైన క్రీడాకారులతో వ్యాయామ ఉపాధ్యాయుడు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-ఎస్.రాయవరం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లాస్థాయి పోటీలలో పాల్గొన్న వారిలో ఇద్దరు విద్యార్థినులు రాష్ట్రస్థాయికి ఎంపిక అయినట్లు రాయవరం వ్యాయామోపాధ్యాయుడు కె శ్రీనువాసరావు తెలిపారు. శనివారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం... స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నేతృత్వంలో విశాఖ డిస్ట్రిక్ట్ ఆర్మ్డ్ రిజర్వు పోలీసు గ్రౌండ్‌లో అండర్ 17 విభాగం అథ్లెటిక్ విభాగం రన్నింగ్‌లో ఇద్దరు విద్యార్థినులు ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. 1500 మీటర్ల రన్నింగ్ విభాగంలో టిఎస్‌వి దుర్గ, 3000 మీటర్ల విభాగంలో కె.కావ్య ప్రథమస్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. ఎంపికయిన ఇద్దరు విద్యార్థినులను ప్రధానోపాధ్యాయుడు యమ్ యస్ సత్యన్నారాయణ, వ్యాయామోపాధ్యాయుడు కె.శ్రీనువాసరావు అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని ఏఎల్‌పురం ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం జి.వరలక్ష్మీ ఆధ్వర్యంలో శనివారం 250 మంది విద్యార్థులకు మిషన్ స్కూల్ హెల్త్, ఐకేర్ ప్రాజెక్టు సహకారంతో విశాఖ కంటి వైద్యశాల సంస్థ ఉచితంగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ వంశీకృష్ణ సిబ్బంది పిల్లలకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఇద్దరికి సైట్ సమస్య, ముగ్గురికి కలర్ విషన్ డిఫిషట్ ఉందని గుర్తించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.మాణిక్యం, ఎం.దేముడుబాబు, అచ్చిబాబు, రామరాజు, మనోహర్ పాల్గొన్నారు.

పట్టాను అందుకుంటున్న రాజు

రాజుకు డాక్టరేట్

ప్రజాశక్తి -పాయకరావుపేట: మండలంలోని అరట్ల కోట గ్రామానికి చెందిన పరిశోధక విద్యార్థి బొడ్డపాటి రాజుకి ఆంధ్ర యూనివర్సిటీ విద్యా విభాగంలో డాక్టరేట్ లభించింది. విభాగ అధిపతి డాక్టర్ టి. షారోన్ రాజు పర్యవేక్షణలో ఎ స్టడీ ఆన్ క్వాలిటీ ఎడ్యుకేషన్ ఇన్ సెకండరీ స్కూల్స్ ఇన్ విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్ " అనే అంశం మీద పరిశోధన చేసినందుకు గాను రాజుకు ఆంధ్ర యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్. పి. వి. జి. డి. ప్రసాద్ రెడ్డి శనివారం అయన ఛాంబర్ లో డాక్టరేట్ పట్టాను అందజేశారు. ఈ సందర్భంగా గైడ్ డాక్టర్ టి. షారోన్ రాజు, విభాగం ఆచార్యులు, పరిశోధకులు రాజుకు అభినందనలు తెలియజేశారు.

దరఖాస్తుల వెల్లువ

ప్రజాశక్తి-పాడేరు : సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గిరిజన యువతకు అందించనున్న ఉచిత సివిల్స్ శిక్షణకు దరఖాస్తులు వెల్లువెత్తాయి. 1843 మంది అభ్యర్థులు దరఖాస్తులు తీసుకున్నారు. సాయంత్రం 6 గంటలకు 1735 మంది దరఖాస్తుల సమర్పించారు.ఐటిడిఏ పిఒ వి. అభిషేక్ ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేసారు. ఈ నెల 7వ తేదీతో దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసిందని స్పష్టం చేసారు. మొదటి దశ రాత పరీక్షకు ఈనెల 9వ తేదీ నుండి హాలు టికెట్లు జారీ చేస్తామన్నారు.

సిఐ చొరవతో రహదారిపై గోతులు పూడ్చివేత

ప్రజాశక్తి-కొత్తకోట: కొత్తకోట- నర్సీపట్నం రహదారిలో వాహన దారులకు ప్రమాద కరంగా మారిన గోతులను పూడ్చేందుకు కొత్తకోట సిఐ సయ్యద్ ఇలియాజ్ మహమ్మద్ చర్యలు చేపట్టారు. స్థానిక ధర్మతేజ పెట్రోల్ బంక్, భోగాపురం గ్రామాల సమీపంలో పెద్ద పెద్ద గోతులు గా మారడం తో తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగు తున్నాయి. దీనిపై స్పందించిన సిఐ రోలుగుంట క్రషర్ మిల్లర్ల సాయం తో గోతులను పూడ్చేందుకు చొరవ తీసుకున్నారు. శనివారం ఈ మేరకు సుమారు నాలుగు ట్రిప్పర్లతో క్రషర్ బుగ్గి లోడులను వేయించి స్వయంగా పర్యవేక్షణ చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ, అధికారులు, రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్ చొరవ తీసుకుని పనులు వేగవంతం చేయాలని సిఐ కోరారు.

గోతులు పూడ్చివేయిస్తున్న సిఐ

శ్మశానంలో బల్లలు ఏర్పాటు

ప్రజాశక్తి-రోలుగుంట: మండలంలోని బుచ్చింపేట గ్రామంలో శ్మశాన వాటికలో బల్లలు ఏర్పాటు చేశారు. అంత్యక్రియలు చేసే సమయంలో వెంట వచ్చిన వారు కూర్చోవటానికి అవకాశం లేక ఇబ్బందులు పడుతుండటంతో గ్రామానికి చెందిన వార్డు సెక్రటరీ అనిమిరెడ్డి రమణ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన సొంత నిధులతో బల్లలను ఏర్పాటు చేశారు. దీంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఏర్పాటు చేసిన బల్ల

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం

ప్రజాశక్తి-గొలుగొండ: స్థానిక గురుకుల పాఠశాల సమీపంలో నివాసం ఉంటున్న మత్స్యకారుడి ఇల్లు శనివారం తెల్లవారుజామున అగ్నికి ఆహుతైంది. కంచర్ల తాతారావు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంటికి మంటలు అంటుకున్నాయి. ఈ ఘటనలో తాతారావు ఇల్లు పూర్తిగా కాలిపోయి భారీగా ఆస్తి నష్టం జరిగింది. ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

కాలిపోయిన ఇల్లు

మాట్లాడుతున్న ఎపిటిఎఫ్ నేతలు

సిపిఎస్ రద్దు చేసే వరకూ పోరాటం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలలను శనివారం ఏపిటిఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటపతి రాజు, జిల్లా ఉపాధ్యక్షులు అప్పారావు, జిల్లా కార్యదర్శి అర్.ప్రకాశరావు సందర్శించారు. ఈ సందర్భంగా వెంకటపతిరాజు మాట్లాడుతూ, ఉపాధ్యాయుల పట్ల ముఖ్య కార్యదర్శి వ్యవహరిస్తున్న తీరును ఖండిస్తున్నా మన్నారు. ఉపాధ్యాయులు ఒక యంత్రంలా పనిచేస్తున్నారన్నారు. మూడు నెలలుగా జీతాలు లేవని, దీనికి ఎవరు బాధ్యత తీసుకుంటారని ప్రశ్నించారు. సిపిఎస్ రద్దు చేసే వరకు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షులు నరసింహమూర్తి, ప్రధాన కార్యదర్శి బ్రహ్మం, రమణ పాల్గొన్నారు.

కార్యకర్తలు కష్టించి పని చేయాలి

ప్రజాశక్తి -హుకుంపేట: కార్యకర్తలు అందరూ సైనికులుగా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు సమ్మరెడ్డి బాలకష్ణ అన్నారు. శనివారం ఆయన నివాసంలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం ఆ పార్టీ మండల అధ్యక్షులు బి.కొండబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన పలువురికి కండువాలు కప్పి పార్టీలోకి బాలకృష్ణ ఆహ్వానించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు సమ్మరెడ్డి బాలకృష్ణ మీడియాతో మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు మనమందరం కృషి చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో సామాన్య ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. పెట్రోలు, గ్యాస్ ధర పెంపుతో అవస్థలు పడుతున్నారన్నారు.

సమస్యలు అడుగుతున్న డిసిహెచ్ శ్రీనివాసరావు

రోగులకు మెరుగైన వైద్యం

డిసిహెచ్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-నక్కపల్లి:ఆసుపత్రికి వచ్చే రోగులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య విధాన పరిషత్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాసరావు సూచించారు. నక్కపల్లి 50 పడకల ఆసుపత్రిని శనివారం ఆయన తనిఖీ చేశారు. వార్డుల్లో పర్యటించారు. రోగులతో మాట్లాడి వైద్య సేవలు ఎలా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. మందుల స్టాక్ పాయింట్ ను పరిశీలించారు. మందులు పూర్తిస్థాయిలో ఉన్నాయో లేదో అడిగి తెలుసుకున్నారు. మందుల కొరత రాకుండా ముందస్తుగా చూసుకోవాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగులతో మర్యాదగా నడుచుకోవాలని వైద్యులకు సూచించారు. వైద్యులు, వైద్య సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ ఈశ్వర్ ప్రసాద్ పాల్గొన్నారు.

సంక్షేమ పత్రాలు ఇస్తున్న ఎమ్మెల్యే

ప్రజా సంక్షేమమే ధ్యేయం

ఎమ్మెల్యే బాబూరావు

ప్రజాశక్తి -నక్కపల్లి:ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో ప్రజల ముంగిటకు సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని ఎమ్మెల్యే గొల్ల బాబురావు అన్నారు. నక్కపల్లిలో నాల్గవ రోజు శనివారం గడపగడపకు కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గడపగడపకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందు తున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే తన దృష్టికి తీసుకురావాలన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రతి గడపకు లబ్ధి చేకూర్చడం జరిగిందన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయడం జరిగిందన్నారు. అభివృద్ధి ,ప్రజా సంక్షేమ ధ్యేయంగా జగన్మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని కొనియాడారు కాలనీవాసులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లారు. సమస్యల పరిష్కారానికి కషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ జయ రత్నకుమారి, వైస్ ఎంపీపీ నానాజీ, పార్టీ మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తి, నాయకులు శేశారత్నం, లోడగల చందర్రావు పాల్గొన్నారు.

'విమర్శలు తగవు'

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:జనసైనికులను విమర్శిస్తే మరింత ముందుకు దూసుకెళతామని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర అన్నారు. శనివారం ఆయన నర్సీపట్నంలో విలేకరులతో మాట్లాడారు. తాము లేవనెత్తిన సమస్యలపై మాట్లాడకుండా వ్యక్తిగత విమర్శలు చేయించడం స్థానిక ఎమ్మెల్యేకు సరికాదన్నారు. తాను ప్రధానమంత్రి స్కీమ్ కింద రుణం తీసుకొని 50 కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్నానని, ఈ నాలుగేళ్ల కాలంలో ఎస్సీ, ఎస్టీ, బిసి సబ్సిడీ రుణాలు ఒక్కరికైనా ఇచ్చారా అని ప్రశ్నించారు. ఎన్నో సమస్యలపై తాము ప్రశ్నిస్తున్నామని, దానికి సమాధానం చెప్పకుండా నాయకులతో దుర్భాషలాడటం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం టౌన్ నాయకులు మారిశెట్టి రాజా, మండలాల అధ్యక్షులు గండెం దొరబాబు, వెలగల వెంకటరమణ, నాయకులు సిద్ధా సుబ్బారావు, వెంకటేష్, మురళీ, బద్రి, చినరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ దుర్మార్గాన్ని ఖండిస్తూ..

ఆశా కార్యకర్తల ధర్నాలు

అనకాపల్లిలో నినాదాలు చేస్తున్న ఆశా కార్యకర్తలు

నర్సీపట్నంలో నినాదాలు చేస్తున్నఆశాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం తమ పట్ల అవలంబిస్తున్న దుర్మార్గ వైఖరిని ఖండిస్తూ ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యాన శనివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించారు. తమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి, గుంటూరు జిల్లా కార్యదర్శి లక్ష్మి, ఇతర ఆశా కార్యకర్తలను, సిఐటియు నాయకులను శుక్రవారం రాత్రి పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి తాడేపల్లి పోలీస్ స్టేషన్లో నిర్బంధించారని, శనివారం ఉదయం వారిని అక్కడి నుంచి గుర్తు తెలియని ప్రాంతానికి తరలించారని, ఆ చర్య అత్యంత దుర్మార్గమని మండిపడ్డారు. ధర్నాలో సంఘం విశాఖ జిల్లా గౌరవ అధ్యక్షురాలు పి.మణి మాట్లాడుతూ మరణించిన ఆశా వర్కర్ కృపమ్మ కుటుంబానికి రూ.50 లక్షల నష్టపరిహారం చెల్లించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి కృపమ్మ కుటుంబానికి ఎక్స్గ్రేషియో ప్రకటన వస్తుందని నమ్మబలికిన అధికారులు అందుకు విరుద్ధంగా సిఐటియు నాయకులను, ఆశా కార్యకర్తలను మరోసారి అరెస్టు చేయడం దారుణమన్నారు. నిత్యం దళితుల గురించి, మహిళలు గురించి గొప్పలు చెప్పుకునే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఇంత సిగ్గుమాలిన విధంగా వ్యవహరించడం మహిళా లోకాన్ని నివ్వెర పరుస్తోందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం పేరుతో ఆశా వర్కర్లకు నిద్రాహారాలు లేకుండా చేస్తున్నారన్నారు. దీని మూలంగా చిత్తూరు జిల్లాలో జానకి అనే ఆశా వర్కర్ నాలుగు రోజుల క్రితం మృతి చెందిందన్నారు. ఇప్పుడు గుంటూరు జిల్లా తాడేపల్లిలో కృపమ్మ చనిపోయిందన్నారు. ఇవి ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలేనన్నారు. చనిపోయిన ఆశాల కుటుంబాలకు రూ.50 లక్షలు ఎక్స్గ్రేషియో ప్రకటించాలని, కుటుంబ సభ్యులలో ఒకరికి ఉద్యోగం, ఇల్లు, ఇళ్ల స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆశాలపై అధికారుల వేధింపులు ఆపాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.పద్మ, కార్యదర్శి వి.మేరీ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో విధి నిర్వహణలో ఉంటూ అకస్మాత్తుగా మరణించిన తాడేపల్లి అర్బన్ పిహెచ్సి ఆశా కార్యకర్త రేవూరి కృపమ్మ కుటుంబానికి రూ.50 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ శనివారం స్థానిక నర్సింగరావుపేట అర్బన్ హెల్త్ సెంటర్లో ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు నిరసన తెలిపారు. అరెస్టు చేసిన నాయకులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కోశాధికారి డి.సూర్య, నాయకులు రమణమ్మ, విజయ తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్:ఆశా కార్యకర్త మృతికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని సిఐటియు డిమాండ్ చేసింది. శనివారం మండలంలో వేములపూడి పీహెచ్సీ వద్ద ఆశ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తల యూనియన్ సభ్యులు మాట్లాడుతూ, గుంటూరు జిల్లా తాడేపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో విధులు నిర్వహిస్తూ తీవ్ర ఒత్తిడి కారణంగా అకస్మాత్తుగా రేపూడి కృపమ్మ మృతి చెందిందని, దీనికీ ప్రభుత్వమే పూర్తి భాద్యత వహించాలని డిమాండ్ చేశారు. అ కుటుంబానికి 50లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తల అమ్మాజి, నాగమణి, లక్ష్మీ కాంతం, లక్ష్మీ పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయంగా బిఎన్ రోడ్డు

-ఎక్కడికక్కడ గోతులు - నత్తనడకన రహదారి పనులు

గోతులుగా ఉన్న బిఎన్ రహదారి

ప్రజాశక్తి -కొత్తకోట:ఆర్ అండ్ బి అధికారులు, రహదారి నిర్మాణ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా నర్సీపట్నం-చోడవరం (బిఎన్) రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. రహదారి ఎక్కడ చూసినా గోతులు మయంగా మారి వాహన దారుల పాలిట శాపంగా మారింది గత ఏడాది కిందట బుచ్చెయ్యపేట మండలం బంగారుమెట్ట నుంచి రావికమతం మండలం మీదుగా రోలు గుంట మండలం యలంకాయలపాలెం వరకూ సుమారు రూ కోటి 10 లక్షల నిధులతో రహదారి నిర్మాణ పనులు చేపట్టారు. నెల్లూరు జిల్లాకు చెందిన ఓ బడా కాంట్రాక్టర్కు టెండర్ ద్వారా పనులు అప్పగించారు.గతేడాదిగా ఈ రహదారి పనులు కొనసాగుతూనే ఉన్నాయి. కాగా అడపా అడపాదడపా కురుస్తున్న వర్షాలకు రహదారి మొత్తం గోతులు మయంగా మారింది. దీంతో ఇటు నర్సీపట్నం వెళ్లాలన్న అటు చోడవరం వెళ్లాలన్నా వాహనదారులు నరకయాతన పడుతున్నారు. అంతేకాకుండా రోజు ఏదో చోట రోడ్డు ప్రమాదాలు గురవుతున్నారు. ఆర్అండ్బి అధికారుల పర్యవేక్షణ లేక పోవడంతో కాంట్రాక్టర్ నిర్లక్ష్య ధోరణితో వ్యవరిస్తున్నారన్నా ఆరోపణలు వినిపిస్తున్నాయి. .ఎక్కడికక్కడ రహదారి గోతులుగా మారడంతో పాటు కాంట్రాక్టర్ చేపట్టిన కల్వర్టుల నిర్మాణం కూడా జాప్యం చేయడంతో రహదారి మరింత ప్రమాదంగా మారింది.

గోతుల రోడ్డుపై చేరిన వర్షపు నీరు

మాడుగుల నియోజకవర్గంలో ఉపముఖ్యమంత్రి ఇలాకాలో దేవరపల్లి, కోటపాడు మండలాల్లో ఆరు నెలల్లో రోడ్లు నిర్మాణ పనులు పూర్తి కాగా, అనకాపల్లి నుంచి బుచ్చయ్యపేట మండలం రాజాం వరకు చేపట్టిన రహదారి నిర్మాణ పనులు శరవేగంగా ఆరు నెలలు పూర్తికావొచ్చాయి. చోడవరం నియోజకవర్గంలో మాత్రం ఏడాదిన్నరగా రహదారి మరమత్తు పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడ గానే ఉన్నాయి. రహదారి నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ తెలుగుదేశం పార్టీ చెందిన సానుభూతి పరుడు కావడంతో ప్రభుత్వా నికి చెడ్డ పేరు తేవడం కోసం నిర్మాణ పనులలో జాప్యం చేస్తున్నాడని ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. కాంట్రాక్టర్ టెండర్ విధానంలో నిబంధనలకు విరుద్ధంగా పనులు చేయడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కాంట్రాక్టర్, ఆర్ ఎం బి అధికారులు నిర్మాణ పనులను వేగవంతం చేసి రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.